



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 265 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 1 జూన్ 2025 వెల : 5/-రూ॥
VOLUME : 11 ISSUE :265 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 1 JUNE 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

# 11 నెలల పాలనలో సంక్షేమ జోరు

- 11 నెలల్లోనే సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తున్నామన్న సీఎం చంద్రబాబు
- దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీ అని వెల్లడి
- భవిష్యత్తులో పింఛన్లు మరింత పెంచే అవకాశం ఉందని సూచన
- గత ప్రభుత్వం స్కీముల పేరుతో స్కాములు చేసిందని ఆరోపణ
- జూన్ 1 నుంచి దుకాణాల ద్వారా రేషన్, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు



పెన్ పవర్ డెస్క్:అధికారంలోకి వచ్చిన 11 నెలల వ్యవధిలోనే రాష్ట్ర ప్రజలకు అపూర్వమైన రీతిలో సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏటా రూ.34 వేల కోట్లను పింఛన్ల కోసం కేటాయిస్తున్నామని, భగవంతుడి ఆశీస్సులు ఉంటే భవిష్యత్తులో ఈ మొత్తాన్ని మరింత పెంచుతామని ఆయన హామీ ఇచ్చారు. అవినీతికి తావులేని సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలోని చెయ్యేరు గ్రామంలో జరిగిన "పేదల సేవలో" కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న రత్నమ్మ, మరియమ్మ అనే ఇద్దరు మహిళలకు ఆయన స్వయంగా పింఛన్లను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

**పింఛన్లతో పేదల జీవితాల్లో వెలుగులు**

తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల మందికి ప్రతి నెలా క్రమం తప్పకుండా పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. రేపు ఒకటో తేదీ ఆదివారం అయినందున, లబ్ధిదారుల సౌకర్యార్థం ఒక రోజు ముందుగానే, అంటే శనివారమే పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా ఉండేదని, కేవలం రూ.200 ఉన్న పింఛనును

వివరాలు 2లో..

## నేటి నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులు

- జూన్ 1 నుంచి పేదలకు రేషన్ దుకాణాల్లోనే నిత్యావసరాలు
- ప్రతినెలా 1 నుంచి 15 వరకు సరుకుల పంపిణీ
- ఉదయం 8-12, సాయంత్రం 4-8 వరకు షాపులు తెరిచే ఉంటాయి
- దివ్యాంగులు, వృద్ధులకు ఇంటివద్దకే రేషన్ అందించే సౌకర్యం
- గత ప్రభుత్వ ఇంటింటి రేషన్ విధానంపై పవన్ విమర్శలు



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని పేద కుటుంబాలకు జూన్ 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారానే నిత్యావసర సరుకులను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇకపై ప్రతినెలా ఒకటో తేదీ నుంచి పదిహేనో తేదీ వరకు చౌక ధరల దుకాణాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. ఈ దుకాణాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయని పవన్ వివరించారు. గత ప్రభుత్వం పేదలకు రేషన్ సరుకులు అందించే చౌకధరల దుకాణాలను మూసివేసిందని పవన్ విమర్శించారు. "ఇంటింటికీ సరుకులు అందిస్తామని చెప్పి, రూ.1,600 కోట్లతో వాహనాలు కొనుగోలు చేశారు. అయితే, ఇంటింటికీ ఇవ్వడం మానేసి, నెలలో ఒకటి రెండు రోజులు మాత్రమే ప్రధాన కూడళ్లలో వాహనాలు నిలిపి సరుకులు

వివరాలు 2లో..

## వాట్సాప్ ద్వారా ఏపీ డీఎస్సీ హాల్ టికెట్లు..

### అభ్యర్థులకు మంత్రి లోకేశ్ కీలక సందేశం

- ఏపీలో 16,347 టీచర్ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ
- జూన్ 6 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు
- అధికారిక వెబ్‌సైట్ cse.ap.gov.inలో హాల్ టికెట్లు
- 95523 00009 వాట్సాప్ నంబర్ ద్వారా కూడా హాల్ టికెట్లు పొందే అవకాశం
- అభ్యర్థులకు శుభాకాంక్షలు చెప్పిన మంత్రి లోకేశ్

వివరాలు 2లో..



## నైజీరియాలో ఉగ్రకుట్ర: బోకో హరాంకు పాక్ శిక్షణ

- నైజీరియాలో నలుగురు పాకిస్థానీయుల అరెస్ట్
- బోకో హరాం ఉగ్రవాదులకు ఆయుధాలు, శిక్షణ ఇస్తున్నారన్న ఆరోపణలు
- ఆకస్మిక దాడులు, ఐఈడీల తయారీ, డ్రోన్ల వాడకంలో శిక్షణ



పెన్ పవర్ డెస్క్:ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయడం లో పాకిస్థాన్ పాత్ర మరోసారి బట్టబయలైంది. నైజీరియాలో బోకో హరాం ఉగ్రవాద సంస్థ సభ్యులకు శిక్షణ ఇవ్వడంతో పాటు, ఆయుధాలు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలపై నలుగురు పాకిస్థానీయులను నైజీరియా భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామం తీవ్ర కలకలం రేపుతోంది.నైజీరియా, సుమారు 46 శాతం ముస్లిం జనాభా కలిగిన దేశం.

వివరాలు 2లో..

## అణచివేతతో వైసీపీ మరింత బలోపేతం

### సజ్జల రామకృష్ణారెడ్డి ధీమా



- చంద్రబాబు ప్రభుత్వంపై సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆరోపణలు
- ఏపీలో 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలవుతోందని విమర్శ
- వైసీపీ నేతలను తప్పుడు కేసులతో వేధిస్తున్నారని ఆక్షేపణ
- పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆవేదన
- ప్రభుత్వ చర్యలతో వైసీపీ మరింత బలపడుతుందని వ్యాఖ్య
- అరాచక పాలన ఎక్కువ కాలం సాగదని హెచ్చరిక

వివరాలు 2లో..

## మహానాడు పెద్ద డ్రామా

- పెన్షన్ల పెంపు తప్ప హామీలు నెరవేర్చలేదని బొత్స ఆరోపణ
- గతేడాది "తల్లికి వందనం" పథకాన్ని ఎగ్గొట్టారని ధ్వజం
- టెన్త్ వాల్యుయేషన్‌లో ప్రభుత్వ వైఫల్యం స్పష్టమయిందన్న బొత్స

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి తీవ్రస్థాయి లో విరుచుకుపడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా, పెన్షన్ల పెంపు మినహా ప్రజలకు ఇచ్చిన హామీలలో వేటిని నెరవేర్చారో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈరోజు వైజాగ్‌లో ఏర్పాటు

వివరాలు 2లో..



## సూపర్ స్టార్ కృష్ణ రియల్ లైఫ్‌లోనూ హీరోనే.. జగన్ ఆసక్తికర పోస్ట్

- సూపర్ స్టార్ కృష్ణ జయంతి
- ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా నివాళి తెలిపిన జగన్
- సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలో కూడా కృష్ణ హీరోగా నిలిచారన్న మాజీ సీఎం

పెన్ పవర్ డెస్క్: సూపర్ స్టార్ కృష్ణ జయంతి. ఈ సందర్భంగా సినీ, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పిస్తూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నా రు. తాజాగా ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కూడా కృష్ణకు

వివరాలు 2లో..



## గాలి మాదిరే లిక్కర్ కేసులో జగన్ జైలుకు వెళతారు



- కడప మహానాడు విజయంతో వైసీపీకి మైండ్ బ్లాంక్ అయిందన్న ఎమ్మెల్యే
- జూన్ 4న 'విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు' కార్యక్రమం చేపడతామని ప్రకటన
- సచివాలయ ఉద్యోగిని దూషించిన ఘటనపై చర్యలుంటాయని వ్యాఖ్య

వివరాలు 2లో..

## ఉగ్రవాదులతో పాటు వారూ భారీ మూల్యం చెల్లించుకున్నారు

- పహల్గామ్ దాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'
- భారత నారీశక్తిని సవాల్ చేసి ఉగ్రవాదులు వినాశనం కొనితెచ్చుకున్నారన్న ప్రధాని
- ఉగ్రవాదులను పోషించేవారికీ భారీ మూల్యం తప్పదని ప్రధాని హెచ్చరిక
- రాణి అహల్యాబాయి 300వ జయంతి వేడుకల్లో ప్రధాని మోదీ ప్రసంగం



పెన్ పవర్ డెస్క్:పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూ ర్'లో భారత నారీశక్తి కీలక పాత్ర పోషించిందని, ఈ చర్య ద్వారా ఉగ్రవాదులు తమ

వివరాలు 2లో..

## విద్యాశాఖలో ప్రక్షాళన: లోకేశ్ కీలక ప్రకటనలు, సంస్కరణల వెల్లడి

- విద్యావ్యవస్థపై జగన్ తీరును తప్పుబట్టిన మంత్రి లోకేశ్
- గత ప్రభుత్వంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటుకు మారినట్లు వెల్లడి
- టీచర్ల బదిలీల్లో గత మంత్రి అవినీతికి పాల్పడ్డారని ఆరోపణ
- సీబీఎస్ఈ, ఐబీ, టోఫెల్ అమలుపై జగన్‌వి అసత్య ప్రచారాలు అని మండిపాటు

వివరాలు 2లో..



## ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు..28 మంది మృతి



పెన్ పవర్ డెస్క్:నైరుతి రుతుపవనాల ప్రభావంతో దేశవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో రుతు పవనాల ఎఫెక్ట్‌తో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈశాన్య రాష్ట్రాలైన అసోం, మేఘాలయ, త్రిపుర మిజోరాం, నాగాలాండ్? లలో భారీ

వివరాలు 2లో..

## మహేశ్ గౌడ్ వి చిల్లర వ్యాఖ్యలు

- బీఆర్ఎస్ మాజీ నేతలను వ్యక్తిగతంగా ఎన్నడూ కలవలేదని క్లారిటీ
- ఈటలతో హరీశ్ భేటీ అయ్యారన్న కాంగ్రెస్ నేత మహేశ్ గౌడ్
- మహేశ్ గౌడ్ ఆరోపణలను ఖండించిన హరీశ్ రావు



పెన్ పవర్ డెస్క్:బీఆర్ఎస్ మాజీ నేత, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తో హరీశ్ రావు రహస్యంగా భేటీ అయ్యారని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చేసిన ఆరోపణలు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. కాళేశ్వరం కమిటీ నోటీసులు జారీ చేసిన తర్వాత ఈటల, హరీశ్ భేటీ అయ్యారని, అదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి,

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# రాజా ది గ్రేట్

ఏంటో తెలియదు కానీ.. బీజేపీలోనూ అసంతృప్తులు మొదలయినట్లే కనిపిస్తుంది. బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సొంత పార్టీ నేతలపై విరుచుకుపడటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజాసింగ్ మూడు సార్లు బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గోషామహల్ నియోజకవర్గం నుంచి 2014, 2018, 2023 లో ఆయన వరసగా గెలిచారు. ఆర్ఎస్ఎస్ భావాలతో పాటు సాలిడ్ కమలం పార్టీ నేతగా అందరిలోనూ గుర్తింపు పొందారు. అలాంటి రాజాసింగ్ గత కొంతకాలంగా పార్టీలో అసంతృప్తిగా ఉన్నారు. ప్రధాన నేతలు వచ్చినా ఆయన వెళ్లడం లేదు. బీజేపీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటూ వస్తున్నారు. తనను నిర్లక్ష్యం చేస్తున్నారన్న భావన ఆయనలో బలంగా ఉందనిపిస్తుంది.

**వ్యతిరేక వ్యాఖ్యలతో...**

రాజాసింగ్ పై అనేక కేసులు నమోదయ్యాయి. జైలుకు కూడా వెళ్లి వచ్చారు. బీజేపీ ఒకసారి రాజాసింగ్ పై సస్పెన్షన్ వేటు వేసి మళ్లీ ఎత్తివేసింది. అయితే ఆయనకు రాష్ట్ర పార్టీ నేతలతో పొసగడం లేదన్నది అర్థమయింది. పార్టీ నాయకత్వ ఆలోచనలకు అనుగుణంగా ఇక్కడి నేతలు పనిచేయడం లేదని భావిస్తున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు పార్టీలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ తొలి నుంచి పార్టీ జెండా పట్టుకున్న తన లాంటి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న అభిప్రాయంలో రాజాసింగ్ ఉన్నారు. అందుకే ఆయన తరచూ పార్టీ నేతలపైనే కామెంట్స్ చేస్తున్నారు. ఆయన వ్యాఖ్యలు పార్టీకి నష్టం చేస్తాయని తెలిసి కూడా వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారంటే ఆయన డిసైడ్ అయినట్లు కనిపిస్తుంది.

**బండి సంజయ్ పైనేనా?**

గతంలోనూ రాజాసింగ్ పార్టీ రాష్ట్ర నేతలపై వ్యతిరేక కామెంట్స్ చేశారు. ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ నేతలు బీఆర్ఎస్ తోకుమ్మక్కవుతున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీని ఖచ్చితంగా ఇబ్బంది పెట్టేవే. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ కు పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా రాకపోవడానికి కారణం కుమ్మక్కు రాజకీయాలేనని రాజాసింగ్ వ్యాఖ్యలతో అర్థమవుతుంది. ఇక తాజాగా తనపై యుద్ధం మొదలయిందని, దొంగలంతా ఒక్కటయ్యారన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ ను విలీనం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్న కవిత కామెంట్స్ ను తాను సమర్థించినందుకు తనపై దుష్ప్రచారం తన పార్టీ నేతలే మొదలు పెట్టారన్నారు. అదే సమయంలో బండి సంజయ్ ను లక్ష్యంగా చేసుకుని ఆయన వ్యాఖ్యలు చేసినట్లు కనపడుతుంది. కరీనంగర్ నుంచే తనపై వార్ మొదలయిందని ఆయన అన్న మాటలపై ఇప్పుడ పార్టీ హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుదన్నది చూడాల్సి ఉంది.

# ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు..28 మంది మృతి

- మొదటి పేజీ తరువాయి

వర్షాలతో కొండచరియలు విరిగిపడి పదిమంది చనిపోయారు. మరోవైపు దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్?, తెలంగాణలో కూడా భారీ వర్షాలతో అతలాకుతలం అయ్యాయి. ఈరాష్ట్రాల్లో 8మంది చనిపోయారు. ఈశాన్య రాష్ట్రాల్లో వర్షాల కారణంగా సంభవించిన విపత్తులలో మృతుల సంఖ్య 10కి చేరుకుంది. గడిచిన 24 గంటల్లో గౌహతి, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతిచెందారు. మేఘాలయలో ఇద్దరు, మిజోరం, నాగాలాండ్, త్రిపురలలో ఒక్కొక్కరు చొప్పున కొండచరియలు విరిగిపడటం, వరదనీటిలో మునిగిపోయి ఐదుగురు చనిపోయారు. అసోంలోని గౌహతిలో కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి చెందారు. శనివారం (మే31) అసోం పశ్చిమ ,దక్షిణ ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయని ఐఎండీ తెలిపింది. అసోంలోని లఖింపూర్‌తో సహా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరదలు సంభవించాయి. మేఘాలయలో కూడా భారీవర్షాలు బీభత్సం సృష్టించాయి. భారీ వర్షాలకు ముగ్గురు మృతి. గడిచిన 24 గంటల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా మేఘాలయలోని తూర్పు ఖాసీ హిల్స్ జిల్లాలో వృద్ధురాలు, మైనర్ సహా ముగ్గురు మృతిచెందారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో సాధారణ జనజీవనం తీవ్రంగా అస్తవ్యస్తమైంది. మిజోరాంలో భారీ వర్షం కారణంగా 5 ఇళ్లు, హొటల్ కూలిపోవడంతో పలువురు మృతి చెందినట్లు తెలుస్తోంది. లాంగ్త్లైలోని బజార్ వెంగ్ ,చాండ్మేరి ప్రాంతాల సరిహద్దు ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి ఇళు ్ళ ,హొటల్‌ను ధ్వంసమైంది. హొటల్‌లో బస చేసిన మయన్మార్‌కు చెందిన అనేక మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు.

**కేరళలో వర్షాలకు ఏడుగురు మృతి, ముగ్గురు గల్లంతు**

కేరళలో నైరుతి రుతుపవనాలతో కురిసిన భారీ వర్షాలకు ఏడుగురు మృతిచెందారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. భారీగా ఆస్తి నష్టం జరిగింది. మరో రెండు రోజులు భారీ వర్షాలున్నందుకు అప్రమత్తంగా ఉండాలని భారత వాతావరణ శాఖ (%×వీణ%) సూచించింది. తిరువనంతపురం జిల్లాలో రెండు ఫిషింగ్ బోట్లలో సముద్రంలోకి వెళ్లిన తొమ్మిది మంది మత్స్యకారులు గల్లంతయినట్లు తెలుస్తోంది. వారిని వెదికేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. కర్ణాటకలోనూ భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. బెలందూర్ లో అత్యధికంగా 48 సె.మీల వర్షపాతం నమోదైంది. మే 30న కర్ణాటకలో భారీవర్షాలు విధ్వంసం సృష్టించాయి. మే 31న తీరప్రాంత కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలో వర్షాల తీవ్రత తగ్గింది.

## మహేశ్ గౌడ్ వి చిల్లర వ్యాఖ్యలు

- మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ తో ఫోన్ లో చర్చలు జరిపారని కూడా మహేశ్ గౌడ్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తాజాగా స్పందించారు. పీసీసీ చీఫ్ హొదాలో మహేశ్ గౌడ్ చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. నేరుగా ఎదుర్కోలేక దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, ఇది సిగ్గుచేటని హరీశ్ రావు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు."విలువలకు తిలోదకాలు ఇచ్చి, రేవంత్ రెడ్డి బాటలోనే మీరూ నడుస్తున్నారు. బట్ట కాల్చి మీద వేసినంత మాత్రానా అబద్ధాలు నిజం అయిపోవు. పెళ్ళిలోనో, చావులోనో కలిసిన సందర్భాలే తప్ప మీరు ఆరోపించినట్లు ఇతర పార్టీ నాయకులను గానీ, మా పార్టీ నుంచి వెళ్లిన నాయకులను గాని ఎప్పుడూ వ్యక్తిగతంగా కలిసింది లేదు. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తాను తప్ప, మీ లాగా చిల్లర రాజకీయాలు చేసి లబ్ధి పొందాలని చూడను. ఇలాంటి ఆరోపణలు మానుకొని స్థాయికి తగ్గట్లు వ్యవహరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై దృష్టి పెట్టాలని మహేష్ కుమార్ గౌడ్ కు సూచిస్తున్నాం" అంటూ హరీశ్ రావు 'ఎక్స్' లో పోస్ట్ పెట్టారు.

## నేటి నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులు

- మొదటి పేజీ తరువాయి

పంపిణీ చేయడంతో ఎంతో మంది పేదలు ఇబ్బందులు పడ్డారు" అని ఆయన అన్నారు. రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక రోజువారీ పనులు మానుకోవాల్సి వచ్చిందని, చిరుద్యోగాలు చేసుకునేవారు సెలవులు పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.మిగిలిన రేషన్ బియ్యం, ఇతర సరుకులను అక్రమంగా తరలిస్తున్న విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపిందని పవన్ తెలిపారు. ఈ విచారణలో భాగంగా వేలాది టన్నుల అక్రమ బియ్యాన్ని కాకినాడ, విశాఖపట్నం ఓడరేవుల్లో పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇటువంటి అక్రమాలను అరికట్టేందుకే, తిరిగి చౌకధరల దుకాణాల ద్వారానే పేదలకు నిత్యావసరాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కొత్త విధానంలో భాగంగా, దివ్యాంగులు మరియు 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు వారి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించే సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పేద ప్రజలకు సక్రమంగా, సకాలంలో నిత్యావసరాలు అందేలా చూడటమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన పునరుద్ఘాటించారు.

# వాట్సాప్ ద్వారా ఏపీ డీఎస్సీ హాల్ టికెట్లు..

ఏపీ మెగా డీఎస్సీకి సంబంధించిన హాల్ టికెట్లు విడుదలైన విషయం తెలిసిందే. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏపీ డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ http:// cse.ap.gov.in ద్వారా తమ హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అయితే, అభ్యర్థులకు వాట్సాప్ ద్వారా కూడా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించారు. దీనికోసం అభ్యర్థులు 95523 00009కు మెసేజ్ చేస్తే సరిపోతుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మెగా డీఎస్సీ అభ్యర్థులకు విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. మెగా డీఎస్సీ నిర్వహణ పట్ల తమ నియబద్ధత నెరవేరిందని, డీఎస్సీలో అభ్యర్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని మంత్రి కోరారు. ఈ మేరకు మంత్రి లోకేశ్ ట్వీట్ చేశారు. "ప్రియమైన అభ్యర్థులారా! మెగా డీఎస్సీ-2025 హాల్ టికెట్లను http:// cse.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే 95523 00009 నంబర్‌లో మా WhatsApp సర్వీస్ ద్వారా కూడా వాటిని పొందవచ్చు. నిర్వహణ పట్ల మా నిబద్ధత నెరవేరింది. ఇప్పుడు మీ వంతు వచ్చింది! మీరు పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరచాలి. అందుకు మీకు శుభాకాంక్షలు. మీరు మీ వంతు కృషి చేసి అద్భుతమైన ఫలితాలతో బయటకు రావాలని కోరుకుంటున్నాను!" అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

ఇక, ఈ డీఎస్సీ పరీక్షలు జూన్ 6 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న విషయం తెలిసిందే. అందుకు తగట్లుగా పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. కాగా, ఈ మెగా డీఎస్సీ ద్వారా 16, 347 టీచర్ ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయనున్న విషయం తెలిసిందే.

# అణచివేతతో వైసీపీ మరింత బలోపేతం

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే 'రెడ్ బుక్ రాజ్యాంగం' పేరుతో ఒక నూతన అప్రజాస్వామిక పాలన సాగిస్తోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వ్యవస్థలను పూర్తిగా భ్రష్టు పట్టించి, ముఖ్యంగా పోలీసు యంత్రాంగాన్ని అదుపులో పెట్టుకుని ప్రతిపక్ష నేతలను, కార్యకర్తలను తప్పుడు కేసులతో వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలకు పాతర వేస్తున్నారని విమర్శించారు. "మేము వస్తే రెడ్ బుక్ రాజ్యాంగం ఉంటుంది, రెడ్ బుక్ పాలన ఉంటుంది అని ఎన్నికలకు ముందే ప్రకటించారు. అదేదో మాటలకే పరిమితం అనుకున్నాం, కానీ ఇప్పుడు దాని పర్యవసానాలు చూస్తున్నాం," అని సజ్జల అన్నారు. వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై ఇటీవల నమోదు చేసిన కేసు ఈ కోవలోకే వస్తుందని ఆయన పేర్కొన్నారు.ఏదైనా కేసులో ఆధారాలుంటే ఎంతవరకైనా వెళ్లవచ్చని, కానీ ఏమీ లేకుండా కల్పిత కథలు సృష్టించి, పాత్రలను తయారుచేసి, వాటిని తమ అనుకూల మీడియాలో రోజుల తరబడి ప్రచారం చేసి, ఆ తర్వాత వ్యక్తులను అరెస్టు చేసి కన్ఫెషన్లు రాయించుకుంటున్నారని సజ్జల ఆరోపించారు. "పదేళ్ల క్రితం నాటి సంఘటనలను కూడా ఇప్పుడు తవ్వి తీసి, విష ప్రచారంతో ప్రజల మెదళ్లలోకి ఎక్కించి, కేసులు బనాయించి జైల్లో పెడుతున్నారు. ఇది సోషల్ మీడియా కార్యకర్తలతో మొదలై, నాయకుల వరకు పాకింది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధమైన అణచివేత చర్యల వల్ల నాయకులు, కార్యకర్తలు మరింత గట్టిగా తయారై వస్తున్నారని, వైఎస్ఆర్‌సీపీ మరింత బలపడుతుందని సజ్జల ధీమా వ్యక్తం చేశారు. "ఒక నెల, రెండు నెలలు నాయకులను జైల్లో పెట్టొచ్చు. కానీ వారు బయటకు వచ్చేసరికి మరింత దృఢంగా మారుతున్నారు" అని తెలిపారు. పోలీసు వ్యవస్థ ఒకసారి గాడి తప్పితే, దానిని మళ్లీ దారికి తీసుకురావడం చాలా కష్టమని, ప్రస్తుతం రాష్ట్రంలో అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయని అన్నారు. తెనాలిలో జరిగిన ఘటనను, కావలి ప్రాంతంలో బహిరంగంగా అసభ్య నృత్యాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడాన్ని ఆయన ఉదహరించారు. "ఖాకీ డ్రెస్సులో గూండాయిజం కళ్ళ ముందు కనపడుతుంది. అధికారులు కొందరు ప్రభుత్వానికి తాబేదారులుగా మారి ఈ అరాచకాలకు సహకరిస్తున్నారు," అని సజ్జల దుయ్యబట్టారు.

చంద్రబాబు నాయుడు ఈరోజు నాటుతున్న విత్తనాల వల్ల భవిష్యత్తులో భయంకరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గ్రహించడం లేదని సజ్జల హెచ్చరించారు. "ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను నొక్కేందుకే ఈ టెర్రర్ క్రియేట్ చేస్తున్నారు. ఈ అరాచకాల మాటున దోపిడీ భయంకరంగా సాగుతోంది" అని ఆరోపించారు.

# నైజీరియాలో ఉగ్రకుట్ర: బోకో హరాంకు పాక్ శిక్షణ

- మొదటి పేజీ తరువాయి

దశాబ్దానికి పైగా ఇక్కడ బోకో హరాం ఉగ్రవాదులతో పోరాటం కొనసాగుతోంది. తాజా అరెస్టులతో, దక్షిణాసియా నుంచి గల్ఫ్ దేశాలకు, బహుశా అంతకు మించి కూడా సరిహద్దు ఉగ్రవాదం విస్తరించిందన్న ఆందోళనలు మరింత బలపడుతున్నాయి.

మీడియా కథనాల ప్రకారం, నైజీరియా అధికారులు వెల్లడించిన వివరాల మేరకు, అరెస్టయిన పాకిస్థాన్ పౌరులు బోకో హరాం ఉగ్రవాదులకు కేవలం ఆయుధాలు సరఫరా చేయడమే కాకుండా, కీలకమైన యుద్ధ నైపుణ్యాలలో శిక్షణ కూడా ఇస్తున్నారని తెలుస్తోంది. ఆకస్మిక దాడులు ఎలా చేయాలి, నిఘా డ్రోన్లను ఎలా ఉపయోగించాలి వంటి అంశాలపై వీరు తర్ఫీదు ఇస్తున్నట్లు సమాచారం. పాకిస్థానీయులతో సహా విదేశీ కిరాయి సైనికుల మద్దతుతో బోకో హరాం, ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ వంటి సంస్థల సామర్థ్యం గణనీయంగా పెరిగిందని నివేదికలు సూచిస్తున్నాయి. నైజీరియా సైన్యానికి చెందిన 'ఆపరేషన్ హదిన్ కాయ్ థియేటర్' కమాండర్ మేజర్ జనరల్ అబ్దుల్ సలామీ అబూబకర్ మాట్లాడుతూ, ఈ విదేశీయులు తిరుగుబాటు గ్రూపులకు వ్యూహాత్మక యుద్ధ పరిజ్ఞానాన్ని అందిస్తున్నారని తెలిపారు. దీనివల్ల బలహీనపడిన బోకో హరాం మరింత ప్రమాదకరమైన ఉగ్రవాద సంస్థగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల ప్రారంభంలో నైజీరియాలోని బోర్నో రాష్ట్రంలోని క్వాటండయా, మల్లాం కరమ్తి గ్రామాల్లో బోకో హరాంకు చెందిన ఓ వర్గం అత్యంత క్రూరమైన దాడులకు పాల్పడింది. ఈ దాడిలో కనీసం 57 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది బాధితుల గొంతులు కోసి లేదా కాల్చి చంపినట్లు సమాచారం. ఉగ్రవాదులు 70 మందికి పైగా ప్రజలను అపహరించినట్లు కూడా తెలుస్తోంది. 2009 నుంచి బోకో హరాం సృష్టిస్తున్న హింసాకాండ కారణంగా 35,000 మందికి పైగా మరణించగా, దాదాపు 26 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఈ సంస్థ పిల్లలను సైనికులుగా నియమించుకోవడంతో పాటు, సామూహిక హత్యలు, అపహరణలకు పాల్పడుతోంది. ఉగ్రవాదాన్ని ఎగుమతి చేయడంలో పాకిస్థాన్ పాత్రపై విశ్లేషకులు చాలాకాలంగా హెచ్చరిస్తూనే ఉన్నారు. రష్యా, ఇరాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్‌లతో పాటు, అమెరికాలో జరిగిన 9/11 దాడుల్లో కూడా పాకిస్థాన్ ప్రమేయానికి సంబంధించి నిర్ధారణ కాని సంబంధాలు ఉన్నాయని గతంలో వార్తలు వచ్చాయి. ఇటీవల భారత్ లో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' అనే తీవ్రవాద నిరోధక ఆపరేషన్, పాకిస్థాన్ సైన్యం, నిఘా సంస్థలపై మరింత నిశిత పరిశీలనకు దారితీసింది. నైజీరియాలో తాజా అరెస్టులు ఈ ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. దక్షిణాసియాకు వేల కిలోమీటర్ల దూరంలో హింసాత్మక గ్రూపులకు పాకిస్థానీ పౌరులు సహాయం చేస్తున్నారన్న ఆరోపణలు, శాంతి, స్థిరత్వం, మానవ భద్రతపై అంతర్జాతీయంగా తీవ్ర ప్రభావం చూపుతాయన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ప్రాంతీయ భద్రతా సమస్యగా పరిగణించిన ఈ వ్యవహారం, ఇప్పుడు విస్తృతమైన ప్రపంచ అత్యవసర పరిస్థితిగా మారుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## విద్యాశాఖలో ప్రక్షాళన: లోకేశ్ కీలక ప్రకటనలు, సంస్కరణల వెల్లడి

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విద్యావ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిందని, మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రజా జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ విఫలమయ్యారని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జగన్ రెడ్డి ఇప్పటికైనా బాధ్యతగా వ్యవహరించాలని హితవు పలికారు. చిన్నప్పుడే పదో తరగతి పరీక్షా పత్రాలు ఎత్తుకెళ్లిన వ్యక్తి నుంచి హుందాతనం ఆశించడం తమ తప్పేనని ఎద్దేవా చేశారు. యూనిఫాం నుంచి చిక్కీల వరకు అన్నింటికీ పార్టీ రంగులు, ఆయన పేరు తగిలించుకుని ఇప్పుడు విలువల గురించి మాట్లాడటం జగన్‌కే చెల్లిందని లోకేశ్ దుయ్యబట్టారు.గత ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాల వల్ల విద్యారంగం తీవ్రంగా నష్టపోయిందని లోకేశ్ ఆరోపించారు. "ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీని రద్దు చేసిన మీరు విద్యావ్యవస్థ గురించి మాట్లాడటమా? అధికారంలో ఉన్నప్పుడు ఉపాధ్యాయులను మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టి, ఇప్పటికీ వారి పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు" అని లోకేశ్ ప్రశ్నించారు.జీవో 117 వంటి నిర్ణయాల వల్ల ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 12 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు తరలిపోయారని తెలిపారు. ఉపాధ్యాయులను, విద్యార్థులను సన్నద్ధం చేయకుండానే వెయ్యి పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టారని, తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టాక నిర్వహించిన పరీక్షల్లో 90 శాతం మంది విద్యార్థులు విఫలమయ్యారని గుర్తుచేశారు. పదో తరగతి ఫెయిల్ అయితే, ముఖ్యంగా ఆడపిల్లల చదువు ఆగిపోయి, వివాహాలు చేసే ప్రమాదం ఉందని, అందుకే సీబీఎస్ఈ విధానాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని వాయిదా వేశామని వివరించారు.జగన్ రెడ్డి ఐబీ విధానం తెచ్చానని కలలు కంటున్నారని, దాని అమలు నివేదిక కోసం రూ.5 కోట్లు ఖర్చు చేశారే తప్ప అమలు చేయలేదని లోకేశ్ విమర్శించారు. టోఫెల్ చెప్పే ఉపాధ్యాయులు లేకుండానే అమలు చేశానని గొప్పలు చెప్పుకోవడం ఆయనకే చెల్లిందన్నారు. రూ.4500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, గుడ్ల నుంచి చిక్కీల వరకు రూ.1000 కోట్ల బకాయిలను తమ ప్రభుత్వంపై మోపి వెళ్లారని ఆరోపించారు. జగన్ హయాంలో ఉపాధ్యాయుల బదిలీల కోసం నాటి మంత్రి డబ్బులు వసూలు చేయడం బహిరంగ రహస్యమని, ఉన్నత విశ్వవిద్యాలయాలను రాజకీయ కేంద్రాలుగా మార్చి వికృత క్రీడ ఆడారని దుయ్యబట్టారు. గ్రూప్-1 వంటి కీలకమైన ప్రశ్నపత్రాలను హైలాండ్ లాంటి ప్రైవేటు రిసార్టులో వాచ్‌మెన్లతో దిద్దించింది జగన్ కాదా? అని ప్రశ్నించారు.

ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగ ప్రక్షాళనకు కట్టుబడి ఉందని లోకేశ్ స్పష్టం చేశారు. "మీరు భ్రష్టు పట్టించిన వ్యవస్థను గాడిన పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నాను. టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ ద్వారా రాజకీయాలకు అతీతంగా ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ చేపడుతున్నాం. కేజీ నుంచి పీజీ వరకు పాఠ్య ప్రణాళిక మారుస్తున్నాం. ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు లక్ష్యంగా పని చేస్తున్నాం. పుస్తకాల బరువు తగ్గించాం, విలువలతో కూడిన విద్య అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం" అని తెలిపారు.

# గాలి మాదిరే లిక్కర్ కేసులో జగన్ జైలుకు వెళతారు

**పెన్ పవర్ డెస్క్:**లిక్కర్ స్కామ్‌లో ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అండ్ కో కూడా మైనింగ్ కేసుల్లో గాలి జనార్దన్ రెడ్డి తరహాలోనే జైలుకు వెళ్లడం ఖాయమని అనంతపురం అర్బన్ శాసనసభ్యులు దగ్గుబాటి ప్రసాద్ సంచలన ఆరోపణలు చేశారు. అనంతపురం నగరంలోని పలు కాలనీల్లో ఈరోజు ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కడపలో ఇటీవల జరిగిన మహానాడుకు 7 నుంచి 8 లక్షల మంది ప్రజలు హాజరై అత్యంత విజయవంతం చేశారని దగ్గుబాటి ప్రసాద్ తెలిపారు. ఈ ప్రజా స్పందన చూసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల మైండ్ బ్లాంక్ అయిందని, ఏం చేయాలో తెలియక 'వెన్నుపోటు దినోత్సవం' అంటూ హడావుడి చేస్తున్నారని ఆయన విమర్శించారు. తాము జూన్ 4వ తేదీన 'విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు' అనే కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.గతంలో మైనింగ్ కేసుల్లో గాలి జనార్దన్ రెడ్డి, రాజగోపాల్, ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి వంటి వారు జైలుకు వెళ్లిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు వెలుగుచూస్తున్న లిక్కర్ స్కామ్‌లో కూడా ధనుంజయ రెడ్డి, గోవిందప్పలతో పాటు జగన్ కూడా జైలుకు వెళ్లక తప్పదని దగ్గుబాటి ప్రసాద్ జోస్యం చెప్పారు.రెండు రోజుల క్రితం అనంతపురంలో ఓ సచివాలయ ఉద్యోగిని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు ఫోన్‌లో దూషించిన ఘటనపై స్పందిస్తూ, ఈ విషయంలో కచ్చితంగా చర్యలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఉద్యోగుల పట్ల ఎవరు దురుసుగా ప్రవర్తించినా, ఏ పార్టీకి చెందినవారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన అన్నారు.

## 11 నెలల పాలనలో సంక్షేమ జోరు

- మొదటి పేజీ తరువాయి

తమ ప్రభుత్వమే రూ.2 వేలకు పెంచిందని గుర్తు చేశారు.

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం, రూ.3,000 పింఛనును రూ.4,000కు పెంచిన ఘనత తమదేనని అన్నారు. డయాలసిస్ చేయించుకుంటున్న రోగులకు రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు చొప్పున పింఛను అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చినట్లే, పింఛన్లను కూడా పంపిణీ చేస్తున్నామని, భగవంతుని దయ ఉంటే భవిష్యత్తులో ఈ మొత్తాన్ని మరింత పెంచుతామని పునరుద్ఘాటించారు.భర్త మరణించిన మహిళలకు అండగా నిలిచేందుకు వితంతు పింఛను పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వంలో భర్త చనిపోతే భార్యకు వెంటనే పింఛను అందేది కాదని, తాము అధికారంలోకి వచ్చాక 71,380 మందికి రూ.4 వేల చొప్పున పింఛను అందించామని వివరించారు. రెండు నెలల పింఛను కలిపి తీసుకుంటున్న 1,22,975 మంది, మూడు నెలల పింఛను కలిపి తీసుకుంటున్న 9,176 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.111.41 కోట్లను విడుదల చేసినట్లు వెల్లడించారు.మనకంటే ఆర్థికంగా బలమైన, అధిక ఆదాయం కలిగిన రాష్ట్రాలు ఉన్నప్పటికీ, వారికంటే మనమే ఎక్కువ పింఛను అందిస్తున్నామని చంద్రబాబు అన్నారు. ఉదాహరణకు, దేశంలోనే అత్యధిక ఆదాయం కలిగిన మహారాష్ట్రలో రూ.1000, తెలంగాణలో రూ.2,500 మాత్రమే పింఛను ఇస్తున్నారని పోల్చి చెప్పారు. ప్రతి ఇంటికీ పెద్ద కొడుకులా అండగా ఉంటానన్న తన మాటను నిలబెట్టుకున్నానని, ఏడాదికి 100 రోజులు కష్టపడితే వచ్చే రూ.30 వేల ఆదాయం కంటే, తామిచ్చే రూ.48 వేల పింఛనే ఎక్కువని ఆయన అన్నారు.

# మహానాడు పెద్ద డ్రామా

- మొదటి పేజీ తరువాయి

చేసిన మీడియా సమావేశంలో బొత్స ఈ వ్యాఖ్యలు చేశారు. ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని చెప్పుకోలేక, కడపలో మూడు రోజుల పాటు టీడీపీ మహానాడు పేరుతో ఒక డ్రామా ఆడారని బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. "పెన్షన్లు పెంచడం తప్ప, ఈ ఏడాది కాలంలో మీరు అమలు చేసిన ఒక్క హామీ అయినా ఉందా?" అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గత ఏడాది "తల్లికి వందనం" పథకాన్ని ప్రభుత్వం ఎగ్గొట్టిందని బొత్స విమర్శించారు. విద్యా వ్యవస్థ నిర్వహణలో కూడా కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. పదో తరగతి పరీక్షల మూల్యాంకనంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోందని అన్నారు. "మా ప్రభుత్వ హయాంలో 500 మందికి మించి విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు వెళ్లేవారు కాదు. కానీ, ఈ కూటమి ప్రభుత్వంలో ఏకంగా 1,650 మంది విద్యార్థులు రీవాల్యుయేషన్ చేయించుకున్నారు. ప్రభుత్వ చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది" అని బొత్స ఆవేదన వ్యక్తం చేశారు. మూల్యాంకన ప్రక్రియలో లోపాల గురించి మాట్లాడుతూ, "రోజుకు 40 జవాబు పత్రాలు దిద్దాల్సిన ఉపాధ్యాయులకు అంతకంటే ఎక్కువ ఇస్తే వాళ్లు మాత్రం ఏం చేయగలరు? ప్రతి పనికి ఒక ప్రణాళిక ఉండాలి. కానీ, కూటమి ప్రభుత్వం ఆ ప్రణాళికను అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతోంది" అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి సరైన దిశానిర్దేశం లేదని, దీనివల్ల అన్ని రంగాల్లోనూ సమస్యలు తలెత్తుతున్నాయని బొత్స సత్యనారాయణ విమర్శించారు.

## సూపర్ స్టార్ కృష్ణ రియల్ లైఫ్‌లోనూ హీరోనే.. జగన్ ఆసక్తికర పోస్ట్

- మొదటి పేజీ తరువాయి

ఎక్స్ (గతంలో ట్విట్టర్) వేదికగా నివాళి తెలుపుతూ ఆసక్తికర పోస్ట్ చేశారు. సూపర్‌స్టార్ కృష్ణ సినిమాల్లోనే కాదు... రియల్ లైఫ్‌లోనూ హీరోనే అన్నారు. సినిమా రంగంలో అజాత శత్రువుగా పేరు పొందిన ఆయన తెలుగు సినీ పరిశ్రమలో ఎన్నో ప్రయోగాలు చేసి విజయవంతమయ్యారని కొనియాడారు. ఈ మేరకు జగన్ చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "సినిమాల్లోనే కాదు, నిజ జీవితంలో కూడా సూపర్ స్టార్ కృష్ణ గారు హీరోగా నిలిచారు. సినిమా రంగంలో అజాత శత్రువుగా పేరు పొందిన ఆయన టాలీవుడ్‌లో ఎన్నో ప్రయోగాలు చేసి సక్సెస్ అయ్యారు. నిర్మాతగా, దర్శకుడిగా, ఎడిటర్‌గా, స్టూడియో అధినేతగా ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారు. తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. అల్లూరి పేరు చెబితే... మనకు కృష్ణాగారే మదిలో మెదులుతారు. రాజకీయాల్లోనూ రాణించారు. నిర్మాతలు, కార్మికుల కష్టాల్లో అండగా నిలిచి పెద్ద మనసును చాటుకున్నారు. నాన్నగారికి అత్యంత ఆప్తులు అయిన కృష్ణ గారి జయంతి సందర్భంగా నివాళులు" అని జగన్ తన పోస్టులో రాసుకొచ్చారు.

# ఉగ్రవాదులతో పాటు వారూ భారీ మూల్యం చెల్లించుకున్నారు

- మొదటి పేజీ తరువాయి

వినాశనాన్ని తామే కొని తెచ్చుకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఆపరేషన్‌లో పలువురు మహిళా అధికారులు పాల్గొని ఉగ్రవాదుల ఆచూకీని గల్లంతు చేశారని ఆయన ప్రశంసించారు. రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా శనివారం భోపాల్‌లో నిర్వహించిన 'మహిళా స్వశక్తికరణ్ మహా సమ్మేళన్'లో ప్రధాని పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రవాదులే కాకుండా, వారిని పోషించేవారు కూడా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భారత్ ప్రపంచానికి స్పష్టం చేసిందని ప్రధాని పేర్కొన్నారు. ఆ సమయంలో భారతీయ మహిళల శక్తిసామర్థ్యాలను ప్రపంచమంతా చూసిందని ఆయన గుర్తుచేశారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం, భారత సరిహద్దు రాష్ట్రాలపై పాకిస్థాన్ దాడులు జరిపినప్పుడు, అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారి నేతృత్వంలోని బీఎస్ఎఫ్ మహిళా బృందం అఖ్నూర్‌లోని ఫార్వర్డ్ పోస్టుల వద్ద మూడు రోజుల పాటు వీరోచితంగా పోరాడిందని ప్రధాని కొనియాడారు."మన సంప్రదాయంలో 'సిందూర్' 'నారీశక్తి'కి చిహ్నం. పహల్గామ్‌లో, ఉగ్రవాదులు కేవలం మన పౌరుల రక్తం మాత్రమే చూడలేదు, మన సంస్కృతిపై దాడి చేశారు. మన సమాజాన్ని విభజించడానికి ప్రయత్నించారు. ఉగ్రవాదులు భారత నారీశక్తికి విసిరిన సవాలే వారి పాలిట, వారిని పోషిస్తున్న వారి పాలిట శాపంగా మారింది. పాకిస్థాన్ సైన్యం కూడా ఊహించని ప్రాంతాల్లో ఉగ్రవాద శిబిరాలపై మన సాయుధ దళాలు దాడులు చేశాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం చేపట్టిన ఈ ఆపరేషన్ భారత చరిత్రలోనే అతిపెద్ద విజయం" అని వ్యాఖ్యానించారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ | డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ | తూ॥ గోదావరి | ప॥ గోదావరి | ఏలూరు

# బిల్లులు లేని రెండు ఇసుక లారీలు సీజ్




**సీతానగరం, పెన్ పవర్, మే31:**
సీతానగరం మండలంలోని కాటవరం ఇసుక ర్యాంపు నుండి అక్రమంగా గుట్టుచప్పుడు కాకుండా ఇసుక రవాణా తరలిస్తున్న లారీలపై టాన్స్పోర్ట్ పోలీసులు ఎట్టకేలకు ఎటువంటి ధ్రువ పత్రాలు లేకుండా రవాణా చేస్తున్న రెండు ఇసుక లారీలను టాన్స్పోర్ట్ ఎస్సై ఆంజనేయులు రెండు లారీలను స్వాధీనం చేసుకుని కొద్దికాలంగా అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని మండలంలో ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి, ఆ ఆరోపణలను నిజం చేస్తూ మండలంలో దాడులునిర్వహించి రెండు లారీలను స్వాధీనం చేసుకునిసీతానగరం పోలీస్ స్టేషన్ కు తరలించారు, వీటిని ఏడి మైన్స్ అధికారులకు బదిలీ చేయడం జరుగుతుందని సరైన అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలుతప్పవనితెలిపారు.

# ఉపాధ్యాయుల కౌన్సిలింగ్‌లో మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయని ఐటిడిఏ అధికారులు



**వై రామవరం, పెన్ పవర్, మే 31 :**
శనివారం నిర్వహించిన ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ లో త్రాగడానికి కనీసం మంచినీటి సౌకర్యం కూడా ఐటీడీఏ అధికారులు ఏర్పాటు చేయలేకపోయారని ఆరోపించారు. వార్షిక బదిలీలలో భాగంగా రంపచోడవరం ఐటీడీఏలో పిఓ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పనా శ్రీ,, డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య ఆధ్వర్యంలో శనివారం ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు, పీజీ హెచ్ఎంల కౌన్సిలింగ్ నిర్వహించారని తెలిపారు. ఉదయం ప్రధానోపాధ్యాయుల కౌన్సిలింగ్ నిర్వహించారని, అనంతరం స్కూల్ అసిస్టెంట్ లో కౌన్సిలింగ్ నిర్వహించారని, ఫిజికల్ డైరెక్టర్లు, ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం లు అనంతరం ఎస్జీటీలకు కౌన్సిలింగ్ నిర్వహించారని తెలిపారు. సుమారుగా 604 మంది ఉపాధ్యాయులు కౌన్సిలింగ్లో పాల్గొన్నారు అని తెలిపారు. 11 మండలాల నుండి ఉపాధ్యాయులు బదిలీల కౌన్సిలింగ్ కు హాజరయ్యారని తెలిపారు. కనీసం త్రాగడానికి మంచి నీటి సౌకర్యం కూడా ఐటిడిఏ అధికారులు కల్పించలేకపోయారని ఉపాధ్యాయులు ఆరోపించారు. రహదారులు ఎంక్రోచ్మెంట్ లో భాగంగా ఆక్రమణలను తొలగిస్తున్నందున, కౌన్సిలింగ్ కు హాజరైన ఉపాధ్యాయులకు కనీసం త్రాగడానికి మంచినీరు,టీ,భోజనం దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇదే పరిస్థితులు ఎదుర్కొన్నామని ఇకనైనా అధికారులు స్పందించి సుదూర ప్రాంతాల నుండి వచ్చే ఉపాధ్యాయులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.




# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి సుభాష్

**కె గంగవరం పెన్ పవర్ మే 31:**
పేదల పాలిట పెన్నిధిగా,నిరుపేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం కె.గంగవరం మండలం కుందూరు గ్రామంలో లబ్ధిదారులకు సామజిక పింఛన్లు పంపిణీ చేశారు.పేదల అవసరాలు, సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నమన్నారు.పేదల పక్షపాతిగా ప్రభుత్వం పని చేస్తూ అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నాం అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.4 వేలు పింఛను మన రాష్ట్రంలోనే ఇస్తున్నామన్నారు.తీవ్ర అనారోగ్యంతో ఉండి, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు పింఛను మంజూరు చేసే కార్యక్రమం కూటమి ప్రభుత్వమే చేస్తుందన్నారు.పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రధాన అజెండాగా తమ ప్రభుత్వ%శీ% ముందుకు సాగుతుందనని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. మంత్రి సుభాష్ వెంట కూటమి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, మాజీ జెడ్పిటిసి మేడిశెట్టి రవికుమార్, ఎంపీపీ పంపన


నాగమణి సుబ్బారావు,రమణ,తదితరులు పాల్గొన్నారు.

# కడపలో పదికి పది అనేది చంద్రబాబు పగటి కల



## జమ్మలమడక నాగమణి


**కాకినాడ.పెన్ పవర్ మే 31:**
ఎన్నికలముందు హామీ ఇచ్చి సూపర్ సిక్స్ పథకాలను అమలుపరచడంలో విఫలమై ప్రజలను మోసం చేసిన చంద్రబాబు కడపలో పదికి పది సీట్లు సాధిస్తామని పగటి కలలు కంటున్నారని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. కడప జగన్ అడ్డా అని తెలిసికూడా ఆడంబరం కోసం కడపలో మహానాడు నిర్వహించి అది విజయవంతం కాకపోయే సరికి చంద్రబాబు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కాక గొప్పలు చెప్పుకుంటున్నారని ఆమె అన్నారు. ఏడాదికాలంగా ప్రకటించిన సూపర్ సిక్స్ ఎప్పుడు అమలు చేస్తారా అనే ప్రజలు ఎదురు చూస్తుంటే అవి అమలు పరచలేదు సరిగదా కొత్త మోసాలతో వింత పోకడలతో, మోసపు మాటలతో ప్రజలను మభ్యపట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఏం చేశారని చంద్రబాబు ప్రభుత్వానికి కడపలో పదికి పది సీట్లు ప్రజలు ఇస్తారని 1,61 వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి మంత్రులు ఎమ్మెల్యేలు జేబులు నింపుకున్నందుకా? మూడేళ్ల బాలికపై అత్యాచారం జరిగితే కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించకపోగా సానుభూతి కూడా తెలియజేయని మహిళా మంత్రులు ఎమ్మెల్యేలు ఉన్న ప్రభుత్వం గురించా? అని ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో ప్రజలు ఉపాధి లేక కుటుంబ పోషణ భారమైన సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతగా బాగుండకపోయినా ప్రజలకు మంచి చేయాలని సదుద్దేశంతో గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను రాజీ లేకుండా అమలుచేసి ప్రజలను ఆదుకున్నారని గత ఏడాది కాలంగా కనీసం వాగ్దానం చేసిన ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేని దౌర్భాగ్య స్థితిలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉందని ఆమె ఎద్దేవా చేశారు. పేద ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచే నాయకుడు జగన్మోహన్ రెడ్డి అయితే పేద ప్రజలను ఆరు మోసపూరిత పథకాలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత వెన్నుపోటు పొడిచిన నాయకుడు చంద్రబాబు అని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కడపలో పదికి పది సాధించేది జగన్ నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వమే అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కడపలో జరిగింది 'మహానాడు' కాదని 'మహాద్రోహం'అని ప్రజలను నమ్మించి దగాచేశారు గనుక దగానాడు అనడం సముచితంగా ఉంటుందని విమర్శించారు. ప్రభుత్వం చేసిన అరాచకాలను ప్రశ్నించిన వైసీపీ కార్యకర్తల పైన నాయకుల పైన కేసులు పెట్టి బెదిరిస్తున్నారని ఇలా ఎంతమందిని అన్యాయంగా అరెస్టు చేస్తారని కోర్టులు కూడా దీనిని సుమోటోగా తీసుకుని ప్రభుత్వంపైన పోలీసులపైన అధికారులపైనా చర్యలు తీసుకునే రోజు త్వరలోనే వస్తుందని ఆమె అన్నారు.

# ఆక్రమణలు తొలగించాల్సిందే



## జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్


**పాడేరు / కె గంగవరం పెన్ పవర్ మే 31:**
రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు,సిసిఎల్ఏ మార్గదర్శకాల ప్రకారం ఆక్రమణలు తొలగించాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేసారు.శనివారం తనను కలసిన పాత్రికేయులతో కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యంగా నదీ గర్భాలు, ప్రభుత్వ పోరంబోకు భూములు, నీటి వాగులు, రహదారి మార్జిన్లలో ఆక్రమించిన ఆక్రమణలను ఏనిమిది వారాలలోగా తొలగించాలని ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో అటువంటి ఆక్రమణలు గుర్తించి నిభంధనల మేరకు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఒక వారం నోటీసు జారీ చేయడం జరిగిందని, దానికి స్పందించని వారికి మరో రెండు రోజులు గడువు విధిస్తూ తిరిగి నోటీసులు జారీ చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు.రెండు రోజుల గడువు తరువాత, రెవెన్యు, పంచాయతి రాజ్, పోలీస్ సహకారంతో తొలగింపుల ప్రక్రియ చేపట్టడం జరిగిందని తెలిపారు.ఇప్పటికే రహదారి వెడల్పుకు సంబంధించి మార్కింగ్ చేయడం జరిగినందున మార్కింగ్ ప్రకారం ఆయా యజమానులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకొని జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు.




# ప్రశాంత వాతావరణంలో పింఛన్లు పంపిణీ

## పాల్గొన్న ప్రత్యేక అధికారి సూర్య కుమారి, కలెక్టర్ నాగరాణి, ప్రభుత్వ విప్ శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మే 31:**
ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ శనివారం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో జరిగింది. పట్టణంలోని మిలటరీ కాలనీ, రూరల్ మండలం వెంకట రామన్నగూడెం గ్రామంలో ఈ పంపిణీ జరిగింది. ఇందులో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ సెక్రెటరీ, పశ్చిమగోదా వరి జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్య కుమారి, జిల్లా కలెక్టర్ నాగరాణి, తాడేపల్లి గూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కలిసి లబ్ధిదారు లకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేకాధికారి ఎం.సూర్య కుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ శనివారం ఉదయం నుండి ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రశాంత వాతావరణంలో అర్హులైన వారందరికీ చేస్తున్నరన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో అర్హులైన వారికి ఒకరోజు ముందుగానే పింఛను అంద చేస్తున్నానని తెలిపారు. జిల్లాలో 2,23,675 మంది లబ్ధిదారులకు రూ.96.73 కోట్ల ను 4,600 మంది సిబ్బందితో ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం కల్లా పింఛన్ల పంపిణీ పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. 2023 డిసెంబర్ ఒకటో తేదీ నుండి 2024 అక్టోబర్ 31వ తేదీ కాలంలో పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన భర్త పెన్షన్ పెండింగ్ ను భార్యకు




ఇవ్వడం జరుగుతుంద న్నారు .జిల్లాలో సుమారు మూడువేల మందికి ఈ నెల 12వ తేదీన పెన్షన్ బకాయిలను అందజేస్తామ ని కలెక్టర్ చెప్పారు. శాసనస భ్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.1000 పింఛను పెంచి ఇస్తున్నదని, దీపం-2 పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నామ ని, తల్లికి వందనం పథకం త్వరలో అమలు చేస్తామన్నారు. అనంతరం తాడేపల్లిగూడెం మెయిన్ కెనాల్ లో కొనసాగుతున్న పూడికి తీత పనులను జిల్లా ప్రత్యేక అధికారి సూర్య కుమారి, కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే శ్రీనివాస్ పరిశీలించారు. తొలుత మిలిటరీ కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ముగ్గురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి ఖతీబ్ కౌసర్ భానో, డి ఆర్ డి ఎ పిడి ఎం ఎస్ ఎస్ వేణుగోపాల్, ఐసిడిఎస్ పిడి బి.సుజాతరాణి, కమిషనర్ ఎం. ఏసుబాబు, ఏపీఓ పి.మురళీకృష్ణ, తహసిల్దార్ ఎం.సునీల్ కుమార్ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు వినియోగం తగ్గించండి
# తోటి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి

## యువత ధూమపానం నుండి బయట పడాలి.. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్



**పాడేరు / కె గంగవరం పెన్ పవర్ మే 31:**
పొగాకు ఉత్పత్తులు సేవించడం వలన, సేవించిన వారికే కాకుండా ప్రక్కన ఉన్న వారిపై కూడా ప్రభావం పడి అనేక దుష్పరిణామాలు కలుగుతాయని,పొగాకు వినియోగం తగ్గించి తోటి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పిలుపు నిచ్చారు.శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పాత బస్ స్టాండ్ అంబేద్కర్ కూడలి నుండి ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించారు.ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ,పొగాకు వినియోగం,ధూమపానం వలన నోటి, ఊపిరితిత్తుల కేన్సర్ వచ్చే అవకాశముందన్నారు. వినియోగదారులు అవగాహనతో చైతన్యవంతులు కావాలని తద్వారా పొగాకు వినిమయాన్ని అరికట్టాలని కోరారు.ముఖ్యంగా యువత ధూమపానం,మత్తు పదార్ధాల వినియోగం విడనాడాలని సూచించారు. కళాశాలలు, పాఠశాలలు, బహిరంగ ప్రదేశాలలో పొగాకు వస్తువులు విక్రయ0, వినియోగం నియంత్రించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిలా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.జమాల్ బాష,ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. హేమలత దేవి, డిఎస్పి షేక్ షేహబాజ్ అహమ్మద్, పలువురు డాక్టర్లు,పారా మెడికల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం కార్యక్రమం



**సీతానగరం, పెన్ పవర్, మే31:**
సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారి డాక్టర్ ఏ.వి.కె .చైతన్య మరియు డాక్టర్ సునీల్ వారి ఆధ్వర్యంలోప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ పొగాకు ను సిగరెట్, చుట్ట, బీడీ,గుట్కా, పాన్ పరాగ్ ఏ రూపంలో వినియోగించినా భయంకరమైన నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ మరియు అనేక రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని కావున ప్రతి ఒక్కరు పొగాకు వాడకానికి వ్యతిరేకంగా పోరాటం చేయవలసిన అవసరం ఉందని తెలిపారు, తదనంతరం పి.హెచ్. సి.సిబ్బంది పొగాకు వ్యతిరేక ప్లకార్డులు ధరించి పొగాకు రహిత సమాజంమన అందరి లక్ష్యంఅంటూ నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు,ఈ కార్యక్రమంలో ఎం ఎమ్ పి హెచ్ ఓ వైయస్ రాయుడు, హెల్త్ సూపర్వైజర్ కే.సుధాకర్, హెల్త్ అసిస్టెంట్లు పి .నందీశ్, గంగాధర్,శ్రీను, వెంకట్రావు, కిషోర్, సూర్యచంద్ర ఏఎన్ లు బి.మంగ,సునీత, ఎస్.కె మునీషా, ఎస్.కెషలీమా,అరుణ ,పద్మాజ్యోతి,ఎల్ టి. శిల్ప ఫార్మసిస్ట్ నగేష్, ఓపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

# మాంటిస్సోరి స్కూల్లో ఘనంగా సమ్మర్ క్లాసులు ముగింపు కార్యక్రమం



**తాళ్లపూడి, పెన్ పవర్, మే 31:**
డాన్స్, మ్యూజిక్, చెస్ వంటివి విద్యార్థుల గొప్ప భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక మాంటిస్సోరి స్కూల్ కరెస్పాండెంట్ వి.వి.అనీష్ పేర్కొన్నారు. మాంటిస్సోరి స్కూల్లో శనివారం డాన్స్, మ్యూజిక్ వంటి సమ్మర్ క్లాసులు ముగింపు సందర్భంలో ఆయన సూచించారు. ఈ సందర్భంగా అనీష్ మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యతో పాటుగా విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీయడానికి సహ పాఠ్య కార్యక్రమాలైన డాన్స్, మ్యూజిక్, చెస్, కీబోర్డ్ ఎంతగానో ఉపయోగపడి, విద్యార్థుల విద్య మెరుగుదలకు ప్రముఖ పాత్ర పోషిస్తాయని అన్నారు. కార్యక్రమంలో భాగంగా కూచిపూడి డాన్స్ మాస్టర్ ప్రభాకరరావు మాట్లాడుతూ మొదటిసారిగా తాళ్లపూడిలోని మాంటిస్సోరి స్కూల్లో ఏర్పాటు చేసిన డాన్స్ అండ్ మ్యూజిక్ సమ్మర్ క్లాసులకు మంచి ఆదరణ లభించిందని తెలిపారు. విద్యార్థులు వారిలో ఉన్న నైపుణ్యాన్ని డాన్స్ ద్వారా వ్యక్తపరిచారని, గ్రామీణ ప్రాంతంలో కూచిపూడి డాన్స్ క్లాస్ లు నిర్వహించడం విశేషం అని తెలిపారు. స్కూల్ కరెస్పాండెంట్ అనీష్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా డాన్స్, మ్యూజిక్ క్లాసులు నిర్వహించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే సంవత్సరం విద్యార్థులకు డ్రాయింగ్, డాన్స్, మ్యూజిక్, చెస్, కరాటే వంటి వాటిల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి నేషనల్ స్థాయికి పంపడానికి కృషి చేస్తామని ప్రభాకర్ తెలిపారు.

# రాష్ట్ర ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

### పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో వనమాడి కొండబాబు

**కాకినాడ.పెన్ పవర్ మే 31 :**
రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందనడానికి ప్రస్తుతం ఇస్తోన్న ఫెన్షన్లు ఒక నిదర్శనమని, గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం ఒకటవ తేదీ ఆదివారం సెలవు దినం సందర్భంగా ఒక రోజు ముందుగానే లబ్దిదారులకు ఇబ్బందులు లేకుండా పెన్షన్ నగదు అందజేస్తోందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక 15 వ డివిజన్ ఏటిమొగ నందు నిర్వహించిన కార్యక్రమంలో కొండబాబు పాల్గొని లబ్దిదారులకు ఫెన్షన్ల నగదు మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా అధిక ప్రాధాన్యత ఇస్తూ పాలన కొనసాగిస్తుంద, కూటమి నాయకులు సచివాలయం సిబ్బందితో కలిసి ప్రతి నెలా ఒకటవ తేదీనే లబ్దిదారులకు ఫెన్షన్లు



పంపిణీ చేసేందుకు కృషిచేస్తున్నారని, ఈసారి ఒక రోజు ముందుగానే ఫెన్షన్ మొత్తాలను అందజేయడం జరుగుతుందని,ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని, త్వరలోనే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కేవలం ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తూ ప్రజల మనసులలో కూటమి ప్రభుత్వం సుస్థిర స్థానాన్ని స్థిరం చేసుకుంటోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అరదాడి శివ, వనమాడి ధర్మారావు, అంగాడి దుర్గారావు, పినపోతు జీవరత్నం, పట్టా ధనలక్ష్మి, ఓలేటి పాండురంగ, కామాడి సుబ్బారావు, కర్రి రాజారావు, సేరు శ్రీను, అప్పారావు, వనమాడి సత్యనారాయణ, నరసింహామూర్తి, బలసాడి శ్రీను, పినపోతు దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యాభిలాషులంతా యోగాంధ్రలో భాగం కండి




### యోగాచార్య చిట్టిబాబు

**కాకినాడ.పెన్ పవర్ మే 31 :**
కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర ఉచిత యోగ క్యాంప్స్" లో ఉద్యోగులు, నగర ప్రజలు ముఖ్యంగా ఆరోగ్యాభిలాష లంతా ఉత్సాహంగా పాల్గొనవలసిందిగా ఆంధ్రప్రదేశ్ యోగ విద్యా పీఠం రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ యోగ గురువు చిట్టూరి చిట్టిబాబు పిలుపునిచ్చారు. యోగాంధ్ర మాసొత్సవాల పేరిట రాబోవు 11వ అంతర్జాతీయ యోగ దివస్ లో కోట్లాది మంది ప్రజలను భాగస్వాములను చేయాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ గత 6 రోజులుగా ఉదయం 6.30 నుండి 7.30 వరకు కార్పొరేషన్ సచివాలయాలు,మెప్మా ఉద్యోగులకు,పుర ప్రజలకు స్థానిక రామారావు పేట 3 లైట్స్ జంక్షన్ లో "రోడ్ యోగ" పేరిట యోగాచార్య చిట్టూరి చిట్టిబాబు మరియు యోగ శిక్షకుల బృందం సహకారంతో ఉచిత యోగ క్యాంపు విజయవంతంగా కొనసాగుతున్నది.ఈ సందర్భంగా శనివారం ఉదయం జరిగిన 'యోగాంధ్ర' ఉచిత యోగ క్యాంప్ లో యోగాచార్య చిట్టిబాబుతో కూడిన యోగ గురువులు కె. రామచంద్ర రాజు, డి.శివకుమారి, ఎమ్. మహిమ, మంజుశ్రీల బృందం యోగ ప్రోటోకాల్‌లో పేర్కొన్న సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాలు, కపాలాభాతి క్రియ, ప్రాణాయామాలు, ధ్యానంపై శిక్షణ అందించారు.లిఈ సందర్భంగా యోగాచార్య మాట్లాడుతూ "నేడు ప్రభుత్వమే ప్రజల వద్దకు యోగ విద్యను స్థానిక సంస్థలు, సచివాలయ ఉద్యోగులు,స్వచ్ఛంద సంస్థల ద్వారా యోగాంధ్ర ఉచిత యోగ శిక్షణ క్యాంప్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చిందని, ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని ఆరోగ్యాంధ్రులుగా నిలబడాలన్నారు. ఐక్యత, సహకారం, సమన్వయం, శాంతి, సామరస్యం లాంటి విలువలతో సంపూర్ణ మానవులుగా ఎదగడానికి యోగ సాధన ఒక 'దిక్సూచి' లా సహాయపడగలదన్నారు. ఈ దిశగా ఉద్యమస్థాయిలో ప్రభుత్వం, అధికారులు తీసుకుంటున్న కార్యక్రమాలకు అందరూ సహకరించాలని, మద్దతుగా నిలబడాలని యోగాచార్య చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు.ఈ శిబిరంలో టి.పి.ఆర్.ఓ. శైలజ, 6వ రోజు ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ 101 స్టాఫ్ సూపరెంటెండెంట్ కె. సూర్య ప్రకాష్, యూపిఐ సెక్షన్ సూపరింటెండెంట్ సతీష్ బాబు, మెప్మా సీఎమ్ఎమ్ వెంకట్రాజు ,మున్సిపల్ కార్పొరేషన్,సచివాలయాల, మెప్మా తదితర కార్యాలయాల ఉద్యోగ సిబ్బంది,విద్యార్థులు,పుర ప్రజలు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమానికి చంద్రబాబు పెద్దపీట

### కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే "పిల్లి"

**కాకినాడ. పెన్ పవర్ మే 31:**
ప్రతి అవ్వా తాతకు ఇంటి దగ్గరకే రూ.4 వేల పెన్షన్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు పంపించి పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని నియోజక వర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి అన్నారు.ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి, కో ఆర్డినేటర్,టీడీపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి నియోజక వర్గంలోని వలసపాకల,వాకలపూడి, గైగోలుపాడు, పి.వెంకటాపురం, రమణయ్య పేట తదితర గ్రామాల్లో టిడిపి శ్రేణులతో కలిసి పింఛనుదారులకు పింఛను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని అన్ని విభాగాల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమాజంలోని పేద,బలహీన వర్గాల కష్టాలను,వృద్ధులు, బలహీనులు,వితంతువులు, వైకల్యం ఉన్నవారి కష్టాలను తీర్చడానికి, గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు ఒక ప్రధాన సంక్షేమం గా ఎన్టీఆర్ భరోసా పింఛను కార్యక్రమం నిలిచిందన్నారు.ఈ బృహత్తర లక్ష్యాన్ని సాధించేందుకు, ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పింఛను ప్రతినెల లబ్ధిదారులకు అందిస్తున్నారని, జూన్ 1ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వం దన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తోన్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లలో 'స్పౌజ్ కేటగిరీ పింఛన్లు' పేరిట పింఛను పొందుతున్న వ్యక్తి చనిపోతే అతని భార్యకు స్పౌజ్ కేటగిరీ కింద మరుసటి నెల నుంచే పింఛన్ కూటమి ప్రభుత్వం ఇస్తుందని,వృద్ధాప్య, వితంతు, చేనేత,



మత్స్యకార, కల్లుగీత, ఒంటరి మహిళ, సంప్రదాయ చెప్పులు కుట్టేవారు, ట్రాన్స్ జెండర్స్,డప్పు కళాకారులకు, కళాకారులకు గతంలో 3వేలు ఇచ్చేవారన్నారు.దానికి అదనంగా వెయ్యి పెంచి 4వేల రూపాయలు అందిస్తున్నామని ,దివ్యాంగులకు, కుష్టు వ్యాధిగ్రస్తులు కు గతంలో 3వేలు ఇచ్చే వారని దానిని 6వేల కు పెంచి ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతపూడి రామకృష్ణ, ఏడుకొండలు, చల్మజి, సూరిబాబు,వీరబాబు, పాలిక సతీష్,సీతారామయ్య, బుంగా సింహాద్రి, పంపన కన్నా రావు, మహేష్,బొజ్జా సాంబ శివరావు,శివ,సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది,టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాని కలిసిన తోట రామకృష్ణ

**తాళ్ళపూడి, పెన్ పవర్, మే 31:**
మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాని నియమించారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజాని జిల్లా వైఎస్సార్సీపీ తూర్పుగోదావరి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు తోట రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి



ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తోట రామకృష్ణ మాట్లాడుతూ జక్కంపూడి రాజా భవిష్యత్తులో మరెన్నో పదవులు అలంకరించాలని కోరుకుంటున్నానని అన్నారు. జిల్లాలో పార్టీని ముందుండి నడిపించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొని, జక్కంపూడి రాజాకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# డిఎంహెచ్ఓ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం



**కాకినాడ. పెన్ పవర్ మే 31:**
కమిషనర్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల అనుసారంగా కాకినాడ జిల్లా నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ర్యాలీ విజయవంతంగా నిర్వహించడం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరసింహ నాయక్ మాట్లాడుతూ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పొగ ఉత్పత్తులు వాడడం వలన ఊపిరితిత్తులు నోటి క్యాన్సర్ క్షయ వంటి వ్యాధులు పొగాకులో ఉండే ప్రాణాంతకమైన నికోటిన్ అనే పదార్థం ద్వారా సంక్రమిస్తాయని అన్నారు. పొగాకు వాడకం వల్ల మనదేశంలో ఏటా 10 లక్షల మంది మరణిస్తున్నారని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో పొగాకు సేవించడం చట్టరీత్యా నేరమని ప్రభుత్వ ఆఫీసులు కళాశాలలు స్కూలు ఆవరణలకు 100 మీటర్ల దూరంలో ఎటువంటి పొగ ఉత్పత్తులను అమ్మరాదని అమ్మినట్లయితే సిఓటిపిఏ( సిగరెట్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ యాక్ట్)చట్టం 2003 ద్వారా వారిపై తగిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ పి డి ఆర్బిఎస్కె పీవో డాక్టర్ అరుణ లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ రోనంకి రమేష్ సుబ్బరాజు ఫైలేరియా ఆఫీసర్ డాక్టర్ విల్సన్ విలేజ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఆశలు ఎన్సీడీ సిబ్బంది పాల్గొన్నారు.

# కాకినాడ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో అవగాహన

**కాకినాడ.పెన్ పవర్ మే 31 :**
కాకినాడ టౌన్ హాల్ సెంటర్ నందు "నెంబర్ ప్లేట్స్ సరిగా లేని వాహనాలపైన"," హెల్మెట్ వాడకం పైన" సైబర్ నేరాలపైన అవగాహన కార్యక్రమం కాకినాడ ట్రాఫిక్-1 పోలీసుల ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ఎం రమేష్ మాట్లాడుతూ మోటార్ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ గవర్నమెంట్ వారు జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలని,మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్/ ధరించాలని,ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని,రాష్ అండ్ నెగ్లిజెన్స్ గా డ్రైవ్ చేయరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని,సెల్ ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని, ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా పాటించాలని తెలిపారు.నిబంధనలను అతిక్రమించిన వారిపైమోటార్ వెహికల్ యాక్ట్ కొత్త చట్టం ప్రకారం తప్పు చేసిన వాహన దారులకు భారీ జరిమానాలు విధించబడునని తెలిపారు. అదేవిధంగాసైబర్ నేరాలలో భాగంగాఆన్లైన్ మోసాలు,ఫేక్ లోన్స్ మోసాలు, ఆన్లైన్ జాబ్స్/వర్క్స్ డిజిటల్ అరెస్టు 112/100, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి వివరించినారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఐపీఎల్ మ్యాచ్ల వీక్షణకు
# ప్రత్యేక స్క్రీన్లతో ఏర్పాట్లు

**కాకినాడ, పెన్ పవర్ మే 31:**
ఐపీఎల్ మ్యాచ్ల కోసం క్రికెట్ ప్రేక్షకులకు ప్రత్యేక స్క్రీన్లతో ఏర్పాట్లను చేసినట్లు బీసీసీఐ ఆపరేషన్ మేనేజర్ ఆల్విన్ గైక్వాడ్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయ ఇంచార్జ్ మేకా లక్ష్మణ మూర్తిలు తెలిపారు. శనివారం ఈ మ్యాచ్లకు సంబంధించి స్క్రీన్పై వీక్షించే ప్రేక్షకుల నిమిత్తం కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్లో వారు విలేకరులతో




సమావేశాన్ని నిర్వహించి వెల్లడించారు. ఈ సందర్భంగా గైక్వాడ్, లక్ష్మణమూర్తిలు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఐపీఎల్ క్వాలిఫై, ఫైనల్ మ్యాచ్ల వీక్షణ కోసం కాకినాడలోని జిల్లా క్రీడా అధికార మైదాన ప్రాంగణం లో పెద్ద స్క్రీన్లతో ఏర్పాటు చేశామన్నారు. జూన్ 1వ తేదీన పంజాబ్, ముంబై జట్ల జరిగే క్వాలిఫై మ్యాచ్తో పాటు మూడో తేదీన జరిగే ఫైనల్ కోసం ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఐపీఎల్ మ్యాచ్లు ఎంతో ప్రాచుర్యం పొందాయని అందులో భాగంగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు కృషితో ఈ స్టేడియంలో ప్రచార వేడుకలను స్క్రీన్లపై ఏర్పాటు చేశామన్నారు. ఎంపీ సానా క్రీడాభివృద్ధి చేస్తున్నారని కాకినాడలో స్టేడియం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నారని అలాగే ప్రతిభగల యువతకు నైపుణ్యాభివృద్ధికి తన వంతు ప్రయత్నం చేస్తున్నారని లక్షణ మూర్తి తెలిపారు. జూన్ 1, 3వ తేదీన జరిగే మ్యాచులు సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయని గైక్వాడ్, లక్ష్మణ మూర్తిలు తెలిపారు. అనంతరం జెర్సీని వారు ప్రారంభించారు.

## జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన
# ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి ఆకుల సాయి పవన్

**కాకినాడ.పెన్ పవర్ మే 31 :**
స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) ఎన్ ఎస్ ఎస్ విద్యార్థి జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు.యువతలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు,జాతీయ సమైక్యతా భావాలను పెంపొందించడానికి, విద్యార్థులు ఇతర ప్రాంతాల సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ విభాగంలో ఉన్న జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత శిబిరాలను నిర్వహిస్తారు.ఆంధ్రప్రదేశ్ ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో జూన్ నెల 6 నుండి 12 వరకు గుజరాత్, అహ్మదాబాద్ లో గల " గుజరాత్ విద్యాపీఠ్ " లో 7 రోజుల పాటు జాతీయ సమైక్యతా శిబిరాన్ని నిర్వహించనున్నారు.ఈ శిబిరంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుండి ఎనిమిది మంది



విద్యార్థులు ఎంపికయ్యారు.భాష, సాంస్కృతిక అంశాలలో ప్రతిభ కనపరిచిన ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆకుల సాయి పవన్ ఈ శిబిరానికి ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు విద్యార్థిని అభినందించి మాట్లాడుతూ శిబిరంలో రిసోర్స్ పర్సన్స్ చెప్పిన అంశాలను శ్రద్ధగా విని ఆకలింపు చేసుకోవాలని అన్నారు.ఈ విధమైన కార్యక్రమాల వలన భావ వినిమయం తోపాటు, జాతీయ భావాలను పెంపొందించుకోవచ్చునని, శిబిరం యొక్క ప్రధాన ఉద్దేశ్యాన్ని గ్రహించి తద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తేజేశ్వరరావు మాట్లాడుతూ తమ విద్యార్థిని జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక చేసిన నన్నయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి వెంకటేశ్వర రావుకు ధన్యవాదాలు తెలిపారు.జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైన విద్యార్థిని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇంచార్జి ఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి తేజేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.

# పంట సాగుదారు హక్కుపత్రం తప్పనిసరి

### జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మే 31:**
ప్రతి కౌలు రైతు పంట సాగుదారు హక్కు పత్రం తప్పనిసరిగా పొందాలని, తద్వారా పంట రుణాలు పొందడానికి సాధ్యమవు తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం పెంటపాడు మండలం పత్తిపాడు గ్రామ సచివాలయం వద్ద పంట సాగుదారు హక్కు పత్రం షరతులపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా పంట సాగుదారు హక్కుపత్రం పొందాలన్నారు. తద్వారా పంటరుణం, పంటల భీమా, ఇన్పుట్ సబ్సిడీ, పంట నష్టం పొందడానికి వీలవుతుందని స్పష్టం చేశారు. ప్రతి కౌలు రైతుకు పంట సాగుదారు హక్కు చట్టం 2019 లోబడి కొన్ని షరతులు వర్తిస్తాయ న్నారు. ఈ చట్టం క్రింద ఎవరైనా న్యాయనిర్ణయ అధికారి ముందు భూ యజమానికి వ్యతిరేకంగా భూమి పై హక్కును క్లైమ్ చేసుకోవడానికి లేదా సమర్థిచుకోవడానికి సాక్ష్యంగా ఈ కార్డును ఉపయోగించకూడదని తెలిపారు. ఈ రుణ అర్హత పత్రం సాగుదారునకు కాల వ్యవధిలో పండిన పంట పై మాత్రమే హక్కు కల్పించడం జరిగిందన్నారు. అంతేకాని భూమి పై ఏవిధమైన హక్కు ఉండదన్నారు. భూమి పై సర్వ హక్కులు భూ యజమానికి మాత్రమే ఉంటాయని స్పష్టం చేశారు. రుణ అర్హత కార్డుదారు పంటరుణం, పంటభీమా, ఇన్పుట్ సబ్సిడీ పంట నష్టం మాత్రమే పొందగలరని తెలిపారు. భూమిపై ఎటువంటి స్వాధీనహక్కు



గాని, కౌలు, ఇతర హక్కులుగాని పొందలేరన్నారు. ఈ కార్డును ఉపయోగించి రెవిన్యూ అధికారి పట్టాదారుని యొక్క భూమిపై హక్కుని ఎట్టి పరిస్థితుల్లో బదలాయించకూడదన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు తదితర ఆర్థికసంస్థలు ఈ కార్డుదారునకు ఇచ్చిన పంటరుణాని తిరిగి వసూలు చేసుకొనుటలో ఫలసాయముపై మాత్రమే హక్కును కలిగిఉంటారని, భూమిపై హక్కును కలిగి ఉండరన్నారు. గ్రామ సచివాలయం భూ యజమానికి, సాగు రైతుకు మధ్య ఈ చట్టం అమలులో అనుసంధానకర్తగా వ్యవహరిస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో తాడేపల్లిగూడెం ఆర్డిఓ కతీబ్ కౌసర్ భానో, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఏడిఏ పి.మురళీకృష్ణ, ఎం ఏ ఓ కె.పార్థసారథి, పెంటపాడు ఇంచార్జ్ తహసిల్దార్ బి.సీతారత్నం, తదితరులు పాల్గొన్నారు.

## "వెన్నుపోటు దినం" కార్యక్రమం పోస్టర్ను
# ఆవిష్కరించిన తోట నరసింహం

**గోకవరం, పెన్ పవర్ ,మే 31:**
ఇచ్చిన హామీలను అమలు చేయలేని ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా జూన్ నాల్గవ తేదీన నిరసనగా "వెన్నుపోటు దినం" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట వైసీపీ ఇంఛార్జి తోట నరసింహం తెలిపారు.నియోజకవర్గ కేంద్రం జగ్గంపేటలో నిర్వహించబోయే కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంపై శనివారం స్థానిక ఎస్ వి



ఆర్ ఫంక్షన్ హాల్ నందు మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలు కలిసి "వెన్నుపోటు దినం" కార్యక్రమం పోస్టర్ ని ఆవిష్కరించిన అనంతరం తోట నరసింహం మాట్లాడుతూ గత ఎన్నికల్లో ముగ్గురు నాయకులు ప్రజలకు అబద్ధాలు చెప్పి అమలు చేయలేని హామీలు ఇచ్చారని,ప్రజలు కూడా వాటిని నమ్మారని ఆయన అన్నారు.ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, ఈ మోసపూరిత ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సంధర్భంగా జూన్ నాల్గవ తేదీన ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తోట నరసింహం అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దాసరి చినబాబు, ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, గుల్లా ఏడుకొండలు, సుంకర రమణ, అక్షింతల రాజా, మడికి మైనర్ బాబు, సమ్మిట మోహన్, బ్యాలా అబ్బులు, నరాల శెట్టి నరసయ్య, జాజులు ప్రసాద్, పైలా కళ్యాణ్, నాగు, అంబటి అబ్రహం, సుమంగళి, తుపాకుల నాగేశ్వరరావు, సత్తిబాబు, బదిరెడ్డి అప్పన్న దొర, రాంబాబు, షేక్ అలీషా, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నివారణకు అవగాహన అవసరం

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,మే 31:**
క్యాన్సర్ నివారణకు సరైన అవగాహన అవసరమని అందుకు మీడియా మిత్రుల సహకారం ఎంతో అవసరమని విజయవాడకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, అంకాలజిస్ట్ మురళీకృష్ణ అన్నారు. తాడేపల్లిగూడెంలో శ్రావణీ అను డయోగ్నొస్టిక్ ల్యాబ్ లో శనివారం జర్నలిస్టుల కోసం ఏర్పాటుచేసిన ఉచిత ఓపీ, పరీక్షల నిర్వహణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాలి, నీరు, ఆహారం కలుషితం ద్వారానే ఎక్కువగా క్యాన్సర్ విజృంభిస్తుందని తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లో క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. మనం తాగుతున్న నీరు కారణమైతే ఆహారం, గాలి కలుషితం మరొక కారణమని తెలిపారు. క్యాన్సర్ ప్రబలకుండా ఉండాలంటే వ్యాధి ఎలా వస్తుందనే అవగాహన ఎంతైనా అవసరమని తెలిపారు. మీడియా ద్వారా మాత్రమే ప్రజల్లోకి చేరువ అవుతుం దన్నారు. ప్రతీ శనివారం తాను తాడేపల్లిగూడెం వస్తున్నానని మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 4గంటల వరకూ అందుబాటులో ఉంటానని



తెలిపారు. మీడియా మిత్రులు ఎవరైనా పైన చెప్పిన రోజున తాను అందుబాటులో ఉండే సమయానికి తనను నేరుగా సంప్రదిస్తే ఓపీ ఇక్కడి ల్యాబ్ లో టెస్టులు కొన్ని ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. తాడేపల్లిగూడెం జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తమ్మిశెట్టి రంగ సురేష్ మాట్లాడుతూ క్యాన్సర్ పై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఎంతైనా అవసరమన్నారు. మీడియా మిత్రులకు ఉచితంగా ఓపీ, ఇక్కడి ల్యాబ్లో కొన్ని టెస్టులు ఉచితంగా చేసేందుకు కృషిచేసిన డాక్టర్ మురళీకృష్ణ, శ్రావణీ అను డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రొప్రైటర్ వెంకట్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ కన్సల్టెన్సీ సెంటర్ నడుస్తున్నంత కాలం మీడియా మిత్రులకు ఓపీ, కొన్ని రకాల పరీక్షలు ఉచితంగా అందజేస్తామని చెప్పారని, ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి శీలి రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సరికొండ రవికుమార్ రాజు, ఉపాధ్యక్షులు చింతకాయల దొరబాబు, సహాయ కార్యదర్శి సనపల భాను, సభ్యులు పెద్దొజు మురళీ, రాంబాబు, వెజ్జు రమేష్, బూర్గుల భానుశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పలివెల వెంకన్నకు 40 ఏళ్లు
# పూర్తి వైభవంగా కళ్యాణ మహోత్సవం

### ఐదు శనివారాలు దర్శనం ఐదొందల సంవత్సరాల పుణ్య ఫలం



**కొత్తపేట, పెన్ పవర్ మే31:**
డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల వంతెన సమీపంలో వేంచేసి యున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం శనివారం అంగ రంగ వైభవంగా జరిగింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది.ఈ ఆలయం స్థాపించి 40 ఏళ్లు పూర్తి అవ్వడంతో చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పోటెత్తారు. ఆలయానికి ఎదురుగా ఉన్న కాలువ దగ్గర ఆలయ కమిటీ భక్తులకు నీటి కొరత లేకుండా ప్రత్యేక వాటర్ ట్యాంక్ నిర్మించి నిత్యం నీరు అందుబాటులోకి తెచ్చామని ఆలయ కమిటీ తెలిపింది.ఆ కాలువ దగ్గర ఉన్న పాంచాల రేవు దగ్గర నిత్యం భక్తుల రద్దీతో ఎన్నో కార్యక్రమాలు జరుతున్నాయని కాలువ నీరు ఒక్కోసారి తక్కువ ఉండడం ,చీకటి సమయాలలో భక్తులు ఇబ్బందులు పడుతుండడంతో ఈ వాటర్ ట్యాంక్, కుళాయాలు నిర్మించమని ఆలయ కమిటీ తెలిపింది.ఈ స్వామి వారిని కళ్యాణ వెంకన్నగా కూడా పిలుస్తారు.ఈ ఆలయానికి ఒక ప్రత్యేకత ఉందని ఐదు శనివారములు ఈ ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటే కళ్యాణం కూడా అవుతుందని కోరుకున్న కోరికలు తీరుస్తాడని భక్తులు విశ్వాసం.ప్రతి ఏటా నిర్వహించే అన్నసమారాధన కంటే ఈ ఏడు 40 ఏళ్లు పూర్తిఅవ్వడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం ఆనందదాయకమని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.





# విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### ఏఐఎస్ఎఫ్ డిమాండ్

**ఆలమూరు, పెన్ పవర్,మే31 :**
విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించాలనుకున్న తమ ప్రయత్నాన్ని అడ్డుకుంటూ పోలీసులు రెండు రోజులుగా తమను పోలీసు స్టేషన్ చుట్టూ తిప్పారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జి రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆలమూరులో శనివారం ఆయన మాట్లాడుతూ ఇది మంచి చేసే ప్రభుత్వం కాదని ముంచేసే ప్రభుత్వం అన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రధానమైన విద్యారంగ సమస్యలు అమలాపురం జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల నిర్మాణం, ఆలమూరు




ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం, మండపేట నియోజకవర్గంలో కేశవరం ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, రామచంద్రపురం పాలిటెక్నిక్ కళాశాల నూతనభవన నిర్మాణం, రాజోలు నియోజకవర్గంలోని ఏఎఫ్టీ విద్యాసంస్థలను ప్రభుత్వంలో విలీనం తదితర డిమాండ్ల సాధన లక్ష్యంగా తమ పోరాటం ఉంటుందన్నారు. ఫీజు రీయంబర్స్మెంటు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్, నాయకులు సతీష్, కుమార్, నూకన్నప్రసాద్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై పశుదాణా




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మే 31:**
పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై సమీకృత దాణాను జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్య కుమారి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుని, 50 శాతం సబ్సిడీపై పశుసమీకృత దాణా పొందవచ్చన్నారు. ఈ దాణా పెట్టటం వల్ల పాల ఉత్పత్తి పెరిగి ఆర్థికంగా లాభం పొందవచ్చన్నారు. 50 కేజీల బస్తా ధర రూ.1,110 కాగా సబ్సిడీపై .రూ.555 పొందవచ్చన్నారు.



కిశోర బాలికలు ఉన్నత స్థానానికి ఎదగాలి... వెంకటరామన్నగూడెంలోని చిల్డ్రన్ హోమ్ ను రాష్ట్ర మహిళ శిశు సంక్షేమం, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ సెక్రటరీ, పశ్చిమగోదావరి జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్యకుమారి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా బాలికలు ఏ విధంగా చదువుతున్నారు, వారికి అందుతున్న పౌష్టికాహారం, వైద్య సహాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి వారంలో రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఈ శిక్షణ కార్యక్రమాల ద్వారా నేర్చుకున్న అంశాలను వారు అడిగి తెలుసుకున్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని హితవు పలికారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకున్నప్పుడే శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. చదువు ద్వారా ఉన్నత స్థానానికి ఎదిగినట్లయితే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుంది అన్నారు. ఆర్డిఓ ఖతీబ్ కౌసర్ భానో, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, ఎమ్మార్వో ఎం సునీల్ కుమార్, తదితరులు ఉన్నారు.

# యోగాలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి




**ఆలమూరు, పెన్ పవర్, మే 31**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 21న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా డేలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని ఎంపీడీఓ ఏ రాజు పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న యోగా శిక్షణాతరగతులను శనివారం ఆయన పరిశీలించారు, శిక్షణ పొందిన అధికారులు, ప్రభుత్వ సిబ్బంది అంతా గ్రామాల్లో పర్యటించి యోగా డే అవశ్యకతను వివరించాలన్నారు. విద్యార్థులను సైతం ఈకార్యక్రమంలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ రాజు ఆదేశించారు. అలాగే యోగా డే ఆవశ్యకతను పలు గ్రామ సచివాలయాల్లో ఆయన వివరించారు. అనంతరం యోగాలో శిక్షణ పొందేందుకు నమోదు చేసుకున్న అశావహుల వివరాలను ఆయన పరిశీలించారు.

# వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరించిన వైసిపి నేతలు

**ఆలమూరు, పెన్ పవర్, మే31 :**
రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జూన్ 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పార్లమెంటు వైసిపి పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆమె మండలంలోని చెముడులంక వైసీపీ కార్యాలయం వద్ద స్థానిక నేతలతో కలిసి వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం యొక్క పోస్టర్ ను ఆవిష్కరించారు. ముందుగా విజయలక్ష్మికి మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4వ తేదీన జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి అమలాపురం పార్లమెంట్లో గల నియోజకవర్గ స్థాయిలో వైసీపీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జడ్పిటిసి తోరాటి సీతామహాలక్ష్మి రాంబాబు, వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, యనమదల నాగేశ్వరరావు, నామాల శ్రీనివాస్,నాంద్ర నాగ మోహన్ రెడ్డి, నవత ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.




# దాని పేరు సమాచార హక్కు చట్టం



ప్రారంభంలో ఎక్కడ చూసినా దాని గురించే చర్చ. దాపరికాలు లేకుండా పౌరులకు సమాచారం ఇవ్వాలన్నదే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనం, పారదర్శకతను తీసుకొచ్చేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని అంతా భావించారు. అయితే ఇందులో కొంత సమన్వయం లోపించడంతో నేటికీ అందని ద్రాక్ష గానే ఉంది. దీంతో ఏలూరు జిల్లాలో ఏలూరు, దెందులూరు, పెదపాడు, లింగపాలెం, ద్వారకాతిరుమల మండలాల్లోని సహ దరఖాస్తు దారులు సమాచారం పొందాలంటే చివరికి సహ చట్టం కమిషనర్ ను ఆశ్రయించవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని గ్రామ పంచాయతీలలో సహ దరఖాస్తులకు సకాలంలో సమాచారం అందించడంలో కార్యదర్శులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నా మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా గ్రామ పంచాయితీలలో సహజ దరఖాస్తులకు నిర్ణీత గడువు లాగా సమాచారం లభించడం లేదు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు చట్టంపై అవగాహన ఏమిటో సమాచారం ఇవ్వాలంటే వేలల్లో సొమ్ము చెల్లించాలని సమాధానం పంపుతున్నారు. సహ చట్టంపై అవగాహన కల్పించాల్సిన ఈవోపీఆర్డీలు, మండల పరిషత్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మండలంలోని గ్రామపంచాయతీలలో సహ చట్టం సమాచారం ప్రదర్శన లేదు. వీటిపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**సమీక్షలు లేవు.. తనిఖీలు లేవు**

సహ చట్టం అమలుపై కొన్నేళ్ల నుంచి సమీక్షలతో పాటు కార్యాలయాల తనిఖీలు లేవు. తొలినాళ్లలో కమిషనర్లు పరిశీలించేవారు. వైకాపా ప్రభుత్వంలో అలాంటివి తగ్గిపోయాయి. జిల్లా స్థాయిలో ఈ చట్టం అమలుపై కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమన్వయ కమిటీ సమావేశాల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది

**సమాచార హక్కు చట్టం.. అమలు నైరాశ్యం**

ఏలూరు పెన్ పవర్ మే 31: ఏలూరు నగరానికి చెందిన వ్యక్తులు పెదపాడు మండలం, తాళ్ల గూడెం, కొత్త ముప్పర్రు, జయపురం గ్రామపంచాయతీ లకి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు. నిర్ణీత గడువు 30 రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉండగా... అంతవరకు వేచి ఉండి, సహ చట్టంలోని సెక్షన్లను పరిగణలోనికి తీసుకోకుండా

అడిగిన సమాచారం నిర్ణీత గడువులోగా సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నా సంబంధిత ఆపిలేట్ అధికారులకు ఫిర్యాదు చేసినా మండల పరిషత్ అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు.

**ద్వారకాతిరుమల మండలం :** ద్వారకా తిరుమల మండలంలో పలు గ్రామ పంచాయతీల్లో ఏ పరిస్థితి నెలకొందని పలువురు సహ దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. మండలంలోని గుండుగొలనుకుంట, జి కొత్తపల్లి, రాళ్ల కుంట, రామన్న గూడెం, దొరసానిపాడు, పంచాయతీలకు ఈ ఏడాది ఏప్రిల్ 28న పలువురు దరఖాస్తుదారులు సమాచారం కోసం దరఖాస్తు చేశారు. నెల రోజులు నిర్ణయించ గడువు దాటినా సమాచారం లభించకపోవడంతో ఆ పిల్లలతో అధికారికి వినతిపత్రం/ఫిర్యాదు పత్రం పంపారు. అయినా సమాచారం లభించలేదు.

**లింగపాలెం మండలం:**

లింగపాలెం మండలంలోని గ్రామ పంచాయితీలను తనిఖీ చేసి పనికి అధికారి టూర్ డైలీ లో రిపోర్టు రాయాల్సిన అధికారి తనిఖీలు నిర్వహించక పోవడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై ఈవో ఆర్ డి టూర్ డైరీ ఇన్స్పెక్షన్ల రిపోర్టులు కావాలని కొంతమంది సహ దరఖాస్తుదారులు మార్చి 26న మండల పరిషత్ కార్యాలయానికి దరఖాస్తు చేశారు. రెండు నెలలు గడిచినను సమాచారం ఇవ్వకుండా తాను ఉత్తమ ఈవో ఆర్డీగా జిల్లా కలెక్టర్ నుండి అవార్డు అందుకున్నానని అధికార దర్పం ప్రదర్శించడంతో మండల పరిషత్ అభివృద్ధి అధికారికి ఈ ఏడాది మే 21న దరఖాస్తుదారులు ఆపిల్ చేశారు. అయినను ఫలితం లేదని దరఖాస్తు దారులు ఆరోపిస్తున్నారు.

**దెందులూరు మండలం:**

దెందులూరు మండలంలో సహ దరఖాస్తులకు సమాచారం ఇవ్వడంలో కార్యదర్శులు పూర్తి గా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన మండల పరిషత్ అధికారులు నిస్తేజంగా వ్యవహరిస్తున్నారు అన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏ పంచాయతీకి కార్యదర్శి ఎవరో తెలియని పరిస్థితి నెలకొందని, సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేస్తే దరఖాస్తులు సంబంధిత పంచాయతీల కార్యదర్శులు వాటిని తీసుకోకుండా వెనక్కి తిప్పి పంపుతున్నారని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. మండలంలోని గోపన్నపాలెం, గాలాయ గూడెం, పోతునూరు పంచాయతీ కార్యదర్శులకు ఈ ఏడాది ఏప్రిల్ ఒకటవ తేదీ న దరఖాస్తు చేసుకోగా రెండు నెలలు గడిచినను సమాచారం లభించకపోవడంతో సహ దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముప్పవరం గ్రామపంచాయతీకి గత ఏడాది సెప్టెంబర్ 14వ తేదీన సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశానని, నేటికీ దానికి సమాచారం లభించలేదని ఏలూరు కు చెందిన సహ దరఖాస్తుదారుడు వాపోయారు. కొత్తగూడెం గ్రామ పంచాయతీకి గత ఏడాది డిసెంబర్ 29న దరఖాస్తు చేసానని, దీనిపై సమాచారం లభించలేదని మండల పరిషత్ కార్యాలయం కి అపీలు చేసినా సమాచారం లభించలేదని సహజరకాస్తుదారులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పాలదర్శకతతో పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి సారించాలని సహజ చట్టం దరఖాస్తుదారులు కోరుతున్నారు.

# డీలర్లు ప్రతి ఇంటికి రేషన్ అందేలా ఏర్పాట్లు చేసుకోవాలి





## చైర్ పర్సన్ సత్యవతి

**ఏలేశ్వరం, పెన్ పవర్, మే 31:**
రేషన్ డీలర్ల షాపుల యజమానులు ప్రతి ఇంటికి రేషన్ అందేలా ఏర్పాటు చేసుకోవాలని ఏలేశ్వరం నగర పంచాయతీ చైర్పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో రేషన్ డీలర్ల అసోసియేషన్ సభ్యులతో సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె డీలర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము సూచించిన నిబంధన ప్రకారం పౌరసరఫరాల డిపోలు పనిచేయాలని అన్నారు. ఎవరు ఎక్కడ పొరపాటు చేసిన ఉపేక్షించేది లేదని డీలర్షిప్ రద్దు చేయబడుతుందని హెచ్చరించారు.ఇప్పటివరకు వాహనాలపై సరఫరా చేసిన బియ్యాన్ని డిపోల ద్వారా ప్రజలకు సరఫరా చేయడం జరుగుతుందని, ఈ సదవకాశాన్ని దుర్వినియోగం చేయకుండా, లబ్ధిదారులను ఇబ్బంది పెట్టకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు.వృద్ధులకు, అనారోగ్యం పాలైన లబ్ధిదారులకు, నిస్సహాయులకు వాళ్ల ఇంటికి రేషన్ అందేలా డీలర్లు వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏదేమైనా ప్రతి నెల ఒకటవ తేదీ నుండి 15వ తేదీ లోపు గడప గడపకు రేషన్ సరుకులు అందేలా రేషన్ డీలర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.జూన్ 1 నుండి తమ విధులకు హాజరవుతున్న డీలర్లకు చైర్ పర్సన్ శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ పరిధిలో 14 డిపోలు ఉండగా ఆయా డీలర్లు సత్యవతికి పలు సూచనలు సలహాలు అందజేశారు. పేదలకు బియ్యాన్ని అందించే పౌరసరఫరాల డిపోలు సేవా తత్పరత కలిగి అంకితభావంతో పనిచేయాలని ఆమె తెలిపారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో డిపో డీలర్లకు కార్డు హోల్డర్లకు సంబంధం బాంధవ్యాలు దూరమయ్యాయని వాటిని మరలా పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ప్రభుత్వం సూచించిన ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు పౌర సరఫరాల డిపోలు తప్పనిసరిగా పనిచేయాలన్నారు. ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు సాయంత్రం నాలుగు గంటల నుండి ఎనిమిది గంటల వరకు విధిగా డిపోలు తెరిచి ఉంచాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల వారికి, 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు తమ ఇంటి వద్దకే రేషన్ అందించే బాధ్యతను డిపో డీలర్లు తీసుకోవాల్సిందన్నారు. ప్రతి ఒక్కరికి రేషన్ సరుకులు అందేలా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పంపిణీ వ్యవస్థను దిగ్విజయంగా నిర్వహించాలని, తదుపరి డీలర్ల సమస్యలు ఉంటే అధిష్టానానికి తెలియజేసి న్యా యం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు, సభ్యులు, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, తొండారపు రాంబాబు, టిడిపి కార్యకర్తలు గునాపు అప్పలరాజు, జామి ఆదినారాయణ, రౌతు సుబ్బారావు, పైల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# సూర్యారావుపేట కాలువ వంతెన పరిశీలన



**ఆలమూరు, పెన్ పవర్, మే31:**
మండలంలోని చింతలూరు నుండి సూర్యారావుపేట వెళ్లే ఆర్ అండ్ బి రహదారిలో ఉన్న కాలువ వంతెన ఇటీవల ఓఎన్జిసి కార్యకలాపాలతో శిథిలావస్థకు చేరుకుందని పత్రికలలో ప్రచరితమైన కథనానికి ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే స్పందించారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో ఆ శాఖ డీఈ సూర్యనారాయణ ఆదేశాల మేరకు ఏఈ వి.వెంకటరమణ, సిబ్బంది, స్థానిక నాయకులతో కలిసి వంతెనను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ వంతెన ఆధారం దెబ్బతిన్న మాట వాస్తవమే అన్నారు. దీనికి పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టాలన్నారు. అప్పటివరకు భారీ వాహనాలకు అనుమతులు నిషేధంగా ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఉన్నత అధికారులకు వంతెన పరిస్థితి నివేదించి మరమ్మత్తులకు ఎస్టిమేట్లు తయారుచేసి పంపిస్తామన్నారు. అలాగే అనుమతులు వచ్చిన వెంటనే వంతెన మరమ్మత్తు పనులు చేపడతామన్నారు. అప్పటివరకు గ్రామస్తులు జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. అలాగే ఈ వంతెనపై భారీ వాహనాల రాకపోకలకు తావు ఇవ్వలేమని, అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే ప్రమాదం పొంచి ఉన్నట్లు తెలిపారు. అలాగే భారీ వాహనాలను నిషేధిస్తూ గడ్డర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి అసిస్టెంట్ ఏడుకొండలు, నాయకులు కాలా సాయిబాబా, కాల ప్రసాద్, కాలా జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి బకాయిలు ఇవ్వాలి

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మే 31:**
ఉపాధి బకాయిలు చెల్లించాలని పెంటపాడు మండలం రావిపాడు, చింతపల్లి గ్రామాలకు చెందిన కూలీలు శనివారం ఆందోళన చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ఆయా గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీల వేతన బకాయిల కోసం ఆవేదన వ్యక్తం చేస్తూ మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటి గంగరాజు, డాకే దానయ్య, దొడ్డి రామకృష్ణ, జంగం విజయలక్ష్మి, రోడ్డ వెంకటేశ్వర్లు, ఎల్లమెల్లి శ్రీను, కోటి చుక్కల సీతారాముడు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ పొగాకు
# రహిత దినోత్సవం

**ఆలమూరు, పెన్ పవర్, మే31 :**
మండలంలోని చొప్పెల్ల, పెదపల్ల పిహెచ్సిల ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు రహిత దినోత్సవ అవగాహన ర్యాలీని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ అనంత రామకృష్ణ, డాక్టర్ లక్ష్మీ స్నేహ లు మాట్లాడుతూ పొగాకు, నికోటిన్ ఉత్పత్తులపై పరిశ్రమ వ్యూహాలను బహిర్గతం చేయడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అలాగే ఆ సంస్థలు తమ హానికరమైన ఉత్పత్తులను ఆకర్షణీయంగా కనిపించేలా చేయడంపై దృష్టి పెట్టడం లక్ష్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ చర్యలు తీసుకుందన్నారు. 1987లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన సమావేశంలో 1988 ఏప్రిల్ 7న ధూమపాన రహిత దినోత్సవంగా పిలుపునిచ్చిందన్నారు.




ప్రపంచవ్యాప్తంగా పొగాకు వినియోగదారులను ఏప్రిల్ 7న 24 గంటలపాటు పొగాకు ఉత్పత్తులను వాడకుండా ఉండమని కోరిందన్నారు. దానిని అనుసరించి 1988లో జరిగిన సమావేశంలో ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించిందన్నారు. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికమన్నారు. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయన్నారు. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే అన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కుల, సిహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ఆలమూరు, పెన్ పవర్, మే31:**
మండలంలోని మూలస్థాన అగ్రహారం 216(ఏ) నెంబర్ గల జాతి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు ప్రకారం మూలస్థాన అగ్రహారం గ్రామానికి చెందిన తోలేటి నారాయణమూర్తి (44) అనే వ్యక్తి గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, శనివారం ఉదయం తన పశువులకు దాన నిమిత్తం సైకిల్ పై జొన్నాడ గ్రామం వెళ్లి అక్కడి నుంచి తిరిగి దానా బస్తాతో తన స్వగ్రామం చేరుకునే తరుణంలో జాతీయ రహదారిపై ఎన్ఎల్ 01 బి 3557 నెంబరు గల ట్రావెల్ బస్సు సైడ్ లగేజీ డిక్కి డోర్ బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారని ఎస్సై తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగానే ఎస్సై అశోక్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించామన్నారు.మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు
## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ



**మండపేట. పెన్ పవర్.మే 31 :**
కూటమి ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. 23 , 24 వార్డుల్లో చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పింఛన్లు ఇచ్చే రోజు ఆదివారం కావడంతో కూటమి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో ఒకరోజు ముందుగా పింఛన్లను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. సచివాలయ సిబ్బంది కూడా ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్లను సక్రమంగా పంపిణీ చేస్తున్నారని ఆయన తెలిపారు.

# రెవిన్యూ పనితీరుపై జేసీ ఆరా

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మే 31:**
స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది పని తీరుపై జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆరా తీశారు. శనివారం ఆయన రెవెన్యూ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. జూన్ 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం మండలంలో రిజిస్ట్రేషన్లు నమోదు శాతం తక్కువ కావడంపై స్థానిక ఎంపీడీవో ను కారణాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ శాతం పెంచి యోగ చేయడం వలన కలిగే ఆరోగ్య సూత్రాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఎక్కువ శాతం ప్రజలు పాల్గొనేలా చూడాలని సూచించారు.



# ప్రజా ద్రోహి చంద్రబాబు

## సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం..
## జూన్ 4న వెన్నుపోటు దినం విజయవంతం చేయాలి
## ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

**మండపేట. పెన్ పవర్. మే 31:**
నమ్మి ఓట్లేసిన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నట్టేట ముంచిన ప్రజా ద్రోహి సీఎం చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వ్యాఖ్యానించారు. విజయలక్ష్మి నగర్లోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన వ్యక్తి చంద్రబాబేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచారని, ప్రజలకు మోసం చేశారని ఆరోపించారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులపై తెరలేపడానికి అసలు ఉద్దేశం టీడీపీ నేతలు సంపద పెంచుకోవడం కోసమేనని విమర్శించారు. సాధారణ ప్రజలకు సూపర్ సిక్స్ వంటి పథకాలు అందించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో కరోనా సమయంలో ఆదాయ వనరులు లేకపోయినా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. జగన్ పాలనలో రూ.3.5 వేల కోట్ల రుణం తీసుకుని ప్రజల ఖాతాల్లో నేరుగా డబ్బు జమ చేశారని తెలిపారు. ఇప్పుడు ఏడాది గడవకముందే చంద్రబాబు రూ.1.6 లక్షల కోట్ల అప్పు చేసి ఒక్క రూపాయి కూడా నేరుగా ప్రజలకు అందించలేదని ధ్వజమెత్తారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పే వ్యక్తి చంద్రబాబు అని, మూడు



సార్లు సీఎం చేసిన ఆయనకు ఈ విషయాలు తెలియకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. చంద్రబాబు వెన్నుపోట్లకు మరోపేరని, ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పెట్టినప్పటి నుంచి అదే ఆయన మార్క్ అని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా కొత్త పింఛన్లు ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు జూన్ 4న నిర్వహించే వెన్నుపోటు దినంను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ స్థాయిలో భారీగా ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా ఈ కార్యక్రమం ఉంటుందని, శాంతియుతంగా నిర్వహించాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం గత ఏడాది పాలనలో ప్రజలను మోసగించిందని ఆరోపించారు. ప్రజల అసంతృప్తిని వెలికితీసేలా ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చైర్‌పర్సన్ పతి వాడ నూక దుర్గారాణి, పార్టీ నాయకులు రెడ్డి రాధాకృష్ణ, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశంలో అత్యధిక పింఛన్లు ఇచ్చిన ఏకైక ప్రభుత్వం
## పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే వేగుళ్ల..



**మండపేట. పెన్ పవర్. మే 31:**
దేశంలో అత్యధిక పింఛన్లను అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఒకటవ తేదీ ఆదివారంకావడంతో ఒకరోజు ముందుగానే జూన్ నెల పింఛన్ల బట్వాడ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. 21వ వార్డు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ళ పాల్గొని పింఛన్లను అందజేశారు. పలు వార్డుల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. సక్రమంగా పింఛన్లు అందిస్తున్నారా లేదా అనేదానిపై లబ్ధిదారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలోనే అత్యధికంగా పెన్షన్ పంపిణీ చేస్తున్న రాష్ట్రం ఏదైనా ఉంది అంటే అది ఒక ఆంధ్రప్రదేశ్ మాత్రమే అని అన్నారు. ఒకటో తారీఖు సెలవు దినం కావడంతో ముందుగా 31వ తేదినే వారి ఇళ్ళకు వెళ్లి ఫించను ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# దోమల నివారణ కోసం పాగింగ్

**వై రామవరం, పెన్ పవర్,మే 31 :**
గ్రామాలలో దోమల నివారణలో భాగంగా పాగింగ్ చేయించడం జరుగుతుందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలలో భాగంగా మండలంలో దోమల నివారణ చేయడం కోసం రాత్రులు పాగింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలో ముందుగా ఎర్రం రెడ్డి



పాలెం పంచాయితీలో మలేరియా దోమల నివారణలో భాగంగా పాగింగ్ జరుగుతుందని తెలిపారు. ప్రతి పంచాయతీలో పాగింగ్ నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

# మలేరియా పట్ల అప్రమత్తత

## రియల్ టైంలో సమాచారం అందించండి... జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్



**పాడేరు/ కె గంగవరం పెన్ పవర్ మే 31:**
వర్షాకాలంలో దోమల వల్ల తరచూ సంభవించే మలేరియా డెంగ్యూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆయా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి డోర్ టు డోర్ ఫీవర్ సర్వే నిర్వహించాలని,జ్వరాలు ఉంటే వారి నుండి శాంపిల్స్ కలెక్ట్ చేయాలని వారికి చికిత్స అందించాలని సూచించారు. ముఖ్యంగా పివిటిజే గ్రామాలు హిల్ టాప్ గ్రామాలు మారుమూల గ్రామాలలో సైతం పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్,మెడికల్ శాఖల ఆధ్వర్యంలో తప్పనిసరిగా ప్రతి ఇంటా బయట స్ప్రేయింగ్ నిర్వహించాలని ఆదేశించారు.రానున్న 90 రోజులు కీలకమైనందున జిల్లా కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోనూ, ఐటిడిఎల ప్రాజెక్టు అధికారుల కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేయాలన్నారు.మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని,యుద్ధ ప్రాతిపదికన స్ప్రేయింగ్ చేయాలని ఆదేశించారు.ప్రతి 15 రోజులకు ఒకసారి వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు తెరవక ముందే పాఠశాలలు వసతి గృహాలలో స్ప్రేయింగ్ నిర్వహించాలన్నారు. అదేవిధంగా పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు తల నుండి పాదం వరకు వరకు పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించాలని ఆదేశించారు. అదే విధంగా వాటర్ ట్యాంకులను క్లీన్ చేయడం ట్యాంకులలో క్లోరిన్ వేయడం కాలువల్లో చెట్లు తొలగించడం, మురికి కూపాలను నిర్మూలించడం తదితర చర్యలు ద్వారా మలేరియా నిర్మూలించాలని ఆదేశించారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన రియల్ టైంలో తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, ఆర్డబ్ల్యూఎస్ అధికారి కే.జవహర్ కుమార్, డీఈవో పి.బ్రహ్మాజీరావు, వర్చువల్ విధానంలో మూడు ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు డాక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ, కె. సింహాచలం, అపూర్వ భరత్, జిల్లా మలేరియా అధికారి తులసి,తదితరులు పాల్గొన్నారు.



# తహసిల్దార్ కార్యాలయంను ఆకస్మికంగా సందర్శించిన జేసీ

## పలు ఫైళ్లను పరిశీలించిన

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహల్ కుమార్ రెడ్డి



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, తాడేపల్లిగూడెం, మే 31:**
శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తాడేపల్లిగూడెం తహసిల్దార్ కార్యాలయం ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు, రికార్డులను పరిశీలించారు. జూన్ 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం మండలంలో రిజిస్ట్రేషన్లు నమోదు శాతం తక్కువ కావడంపై స్థానిక ఎంపీడీవో ను కారణాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ శాతం పెంచాలని, యోగ చేయడం వలన కలిగే ఆరోగ్య సూత్రాలను ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఎక్కువగా శాతం ప్రజలు పాల్గొనేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా జే సీ తో పాటు ఆర్డీవో ఖతీఫ్ కౌసర్ భాను, తహసిల్దార్ ఎం.సునీల్ కుమార్, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నరు.

## వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా

# బదిరెడ్డి గోవింద్ నియామకం



**ఏలేశ్వరం, పెన్ పవర్, మే 31:**
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా బదిరెడ్డి గోవింద్ నియామకం పట్ల పలువురు వైయస్సార్సీపి ప్రముఖులు శనివారం అభినందించారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలతో, దాడిశెట్టి రాజా, ముద్రగడ పద్మనాభం, ముద్రగడ గిరిబాబు ల సహకారం మేరకు రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా బదిరెడ్డి గోవింద్ నియమితులయ్యారు. బదిరెడ్డి గోవింద్ కు గత వైసీపీ ప్రభుత్వంలో ఏలేశ్వరం మండల ఇంచార్జిగా పని చేసిన అనుభవం ఉంది.ప్రస్తుతం గోవిందు ఏలేశ్వరం నగర పంచాయితీ 3 వ వార్డు కౌన్సిలర్ గా,ఆయన మాతృమూర్తి బదిరెడ్డి వెంకటరమణమ్మ 17వ వార్డు కౌన్సిలర్ గా పనిచేస్తూ కౌన్సిల్ సమావేశంలో తనదైన రీతిలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారు. ఈ సందర్భంగా మీడియాతో గోవింద్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్ మోహన్ రెడ్డి తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి పూర్తి న్యాయం చేస్తానన్నారు.నాకు ఈ అవకాశం కల్పించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజాకి, పిఎసి సభ్యుడు ముద్రగడ పద్మనాభంకి,నియోజకవర్గ ఇంచార్జి ముద్రగడ గిరిబాబుకి కృతజ్ఞతలు తెలియజేశారు. తమ అభిమాన నాయకుడు బదిరెడ్డికి పార్టీ పదవి లభించడంతో ఏలేశ్వరం పట్టణంలో వైసిపి అభిమానులు హర్షం ప్రకటిస్తూ గోవిందుకు అభినందనలు తెలిపారు.

## ఒక్కరోజు ముందుగానే

# పింఛన్లు పంపిణీ

### ఎమ్మెల్యే ముప్పిడి



**కొవ్వూరు, పెన్ పవర్, మే 31:**
జూన్ 1 ఆదివారం కావడంతో ఒకరోజు ముందే పింఛన్లు చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కొవ్వూరు టౌన్ లో పింఛన్లు పంపిణీలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక తెల్లవారక ముందే పింఛన్ల పంపిణీ జరుగుతుందని, ఒక్క రోజులోనే చాలా వరకు పింఛన్ల పంపిణీ పూర్తవుతుందని తెలియజేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు సూరపనేని సూర్య భాస్కర రామ్మోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక పెన్షన్ లబ్ధిదారులు అందరికి మొదటి రోజే పెన్షన్ అందుతుందని, గత ప్రభుత్వంలో కనీసం మూడు, నాలుగు రోజుల వరకు పెన్షన్ పంపిణీ జరిగేదని అన్నారు. ఈ లోపు లబ్ధిదారులు పెన్షన్ గురించి ఎదురు చూసేవారని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ భావన రత్నకుమారి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఒకరోజు ముందుగానే సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ

### రాత్రి 8 గంటల వరకు పెన్షన్ల పంపిణీ - జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, మే 31:**
జిల్లా వ్యాప్తంగా 2,33,924 మందికి రూ.102 కోట్ల 19 లక్షల 22 వేలను ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ. కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీలో భాగంగా రాత్రి 8 గంటల వరకు 2,18,966 మందికి 93.61 శాతం పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలియచేశారు. శనివారం రాజమండ్రి రూరల్ పిడింగోయి గ్రామ పంచాయతీ నాలుగో వార్డ్ లో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లను పంపిణీ చేశారు. స్థానిక 4వ వార్డు కోనేరు పేటకి చెందిన చీరా



రమణమ్మకు రూ.4000 వేలు వృద్ధాప్య పెన్షన్ అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ పూర్తిగా మంచానికే పరిమితం అయిన రమణమ్మకు వైద్య అధికారులు ద్వారా తగిన వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. దీర్ఘకాలికంగా మంచానికే పరిమితం అవ్వడం జరిగిందని కుటుంబ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకుని రావడం జరిగింది. ఈ సందర్భంగా స్పందించిన కలెక్టర్ తగిన వైద్య పరీక్షలు చేయాలని, తదుపరి మంచానికి పరిమితం అయిన రమణమ్మకు పెన్షన్ పెంపుపై తగిన ప్రతిపాదన పంపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట ఇన్చార్జి ఎంపీడీవో కే.ఎస్.ఆర్మ్ స్ట్రాంగ్ తదితరులు పాల్గొన్నారు

## రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి



**పెద్దాపురం, పెన్ పవర్, మే 31:**
రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై. జ్యోతిర్మయి సూచించారు. మండల పరిధిలోని కట్టమూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో శనివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పెద్దాపురం ఏఎఫ్.టీసీ డిడి హరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ హాజరై మాట్లాడారు. రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పంటలను సాగు చేయాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేందుకు రైతులు శాస్త్రవేత్తల సూచనలు సలహాలు పాటించడంతోపాటు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం పశు వైద్యాధికారి డాక్టర్ నాగేశ్వరరెడ్డి పశుసంవర్ధక శాఖ అందిస్తున్న పథకాలు గురించి వివరించారు. మినీ గోకులం షెడ్లు నిర్మాణానికి 50% సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని, అలాగే మొబైల్ అంబులెన్స్ అందుబాటులో ఉందని, పెయ్య దూడలు మాత్రమే పుట్టే విధంగా ఇంజక్షన్లు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఉద్యానవన, మత్స్య శాఖలు అందిస్తున్న పలు రకాల సబ్సిడీలు, పథకాలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కొమ్మోజు సంజయ్ కుమార్, మండల ఉద్యాన శాఖాధికారిణి నూనె సుజాత, గారు, ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్ ఏవో సంజీవ్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అజ్మల్, డాక్టర్ శ్యామల, డాక్టర్ మురళీధర్, ఎన్. బాబురావు, గుత్తుల సూర్యవతి, అధిక సంఖ్యలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు రేషన్ షాపుల వద్ద సరుకులు పంపిణీ ప్రారంభించనున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే



**ఏలేశ్వరం, పెన్ పవర్, మే 31:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జూన్ ఒకటవ తేదీ నుండి చేపడుతున్న రేషన్ షాపుల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ఆదివారం ప్రారంభించనున్నట్లు ప్రత్తిపాడు శాసనసభరాలు వరుకుల సత్యప్రభ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.00 గంటలకు ఏలేశ్వరం మండలం సిరిపురంలో రేషన్ షాపుల వద్దనే, సరుకుల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తారు. 65 సంవత్సరాల వయసు దాటిన వృద్ధులకు, వికలాంగులకు వారి ఇళ్ల వద్దకే వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయబడుతుందని ఎమ్మెల్యే ఆ ప్రకటనలో వెల్లడించారు.

## టిడిపి స్థాపనతోనే ప్రజాస్వామ్య

# పునరుద్ధరణకు ఎన్టీఆర్ కృషి

### - ఎమ్మెల్యే పితాని

**పెనుమంట్ర, పెన్ పవర్,మే-31:**
తెలుగుదేశం పార్టీ స్థాపించే ముందు రాజకీయాలు పెత్తందారుల చేతుల్లో ఉండేయని టిడిపి స్థాపనతో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఎన్టీఆర్ కృషి చేశారని మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం ఆచంటలో మండల టిడిపి విస్తృత స్థాయి సమావేశం రామేశ్వర స్వామి సత్రంలో నిర్వహించారు . ఈ సమావేశానికి శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, ఆప్కా చైర్మన్ గన్ని వీరాంజనేయులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ టిడిపి పార్టీని ఆవిష్కరించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోనికి తీసుకు వచ్చిన ఘనత అన్న ఎన్టీ రామారావుకు దక్కుతుందని అన్నారు. సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళుగా ప్రజలకు ప్రజా పాలన అందించింది ఎన్ టి రామారావు అని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విభజన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. పార్టీకి పనిచేసిన వ్యక్తులను పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందని కష్టపడిన వారికి పదవులు దక్కుతాయని




కుడుపూడి సత్తి బాబుకు శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్, ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులుగా పనిచేసిన గన్ని వీరాంజనేయులు కు ఉమ్మడి జిల్లా కోపరేటివ్ బ్యాంకు చైర్మన్, రాష్ట్రంలో ఆప్కా చైర్మన్ గా ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. వీరి ఇరువురిని సాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఆచంట తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా చిలుకూరి సీతారామ్ తెలుగుదేశం పార్టీ ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు. ఆచంట టౌన్ అధ్యక్షునిగా తమ్మినేడి పృథ్వీ కుమార్ ఎన్నికయ్యారు. వీరి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అభినందించారు. అలాగే గ్రామాల్లో ఎన్నిక కైనా గ్రామ అధ్యక్ష కార్యదర్శులను సత్కరించారు. అధ్యక్షులుగా పార్టీకి సేవలు అందించిన కేత మీరయ్య ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆచంట జడ్పిటిసిఉప్పలపాటి సురేష్ బాబు , ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, మండల పార్టీ అధ్యక్షులు కేత మీరయ్య, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ తమ్మినేడి రామకృష్ణ ప్రసాద్, జక్కం శెట్టి సత్యనారాయణ,, వెలగల బుల్లి రామిరెడ్డి, రుద్రరాజు రమేష్ రాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడపాటి దుర్గాప్రసాద్, ఆచంట నియోజకవర్గం అధ్యక్షులు బీర నరసింహమూర్తి, కేత మురళి, సర్పంచ్ గుబ్బల మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో

# అవగాహన సదస్సు

**పెనుమంట్ర,పెన్ పవర్,మే-31:**
మండలంలోని మార్టేరు గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో రామకృష్ణ సేవా సమితిలో విశ్రాంత తహసిల్దార్ చిర్ల సూర్య నారాయణ రెడ్డి పిల్లలకు శ్లోకాలు చెప్పడం జరిగిందని గ్రంథపాలకుడు పిటిఎస్ కుమార్ శనివారం తెలిపారు. విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయురాలు పి. సువర్ణ గౌరి పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్ మరియు స్టోరీ టెల్లింగ్ చెప్పడం జరిగిందని అన్నారు. యెగా పిల్లలకు కథలు పుస్తకాలతో పాటు ఆరోగ్యం సంబంధించిన పుస్తకాలు చదివించడం జరిగిందన్నారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో కె. దిక్షిత లక్ష్మి ప్రసన్న, వై. నిహాల్, డి. హేమనందిని, యమ్. సౌజన్య, కె. దివ్య, డి. జశ్వంత్ అమర్ రెడ్డి, కె. శ్రావ్య, కె. కార్తికేయ, యమ్. కార్తిక్ స్వరుప్ రెడ్డి,వి. హర్దక్ వెంకట రామారెడ్డి తదితరు పిల్లలు పాల్గొన్నారు.



## శృంగార వల్లభ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



**పెద్దాపురం, పెన్ పవర్, మే 31:**
పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొనేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి వారిని ఈరోజు సుమారు పదిహేను వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 2,27,080, అన్నదాన విరాళాల ద్వారా రూ. 67,407, కేశఖండన ద్వారా రూ. 7600, తులాభారం ద్వారా రూ. 550, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 28,770, స్వామివారి కానుక ద్వారా రూ.3000, మొత్తం రూ. 3,34,407 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం, అలాగే వేసవి దృష్ట్యా మజ్జిగ పంపిణీ చేశామని, సుమారు మూడు వేల ఐదు వందల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

### జె.రాంబాబు

**కాజులూరు,పెన్ పవర్,మే 31:**
మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎంపీడీవో, కూటమి నేతలు శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అట్టహాసంగా పంపిణీ చేశారు. గొల్లపాలెం గ్రామంలో టిడిపి పార్టీ సీనియర్ నాయకులు చుండ్రు వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ నిర్వహించారు. కుయ్యేరు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు చవ్వాకుల డాక్టర్ బాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు.అలాగే పెనుమల్ల, బంధనపూడి శలపాక,ఆర్యవటం, తను మల్ల, కోలంక,తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు,సర్పంచ్ లు,కూటమి నేతల ఆధ్వర్యంలో పింఛన్లు లబ్దిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. అలాగే పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో జే రాంబాబు పలు గ్రామాలు పర్యటించారు. పింఛన్ కార్యక్రమం తో పాటు ,గ్రామాల్లో పర్యటించి,పారిశుద్ధ్య పనులపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు.ఈ నేపథ్యంలో ఎంపీడీవో జే రాంబాబు మండల పరిధిలోని ఆర్యవటం గ్రామంలో పలు వీధులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్యావటం, గొల్లపాలెం గ్రామాల్లో పర్యటించిన ఆయన, పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పారిశుధ్య పరిస్థితులను సమీక్షించారు.ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వీధులన్నీ శుభ్రంగా ఉంచాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోను, ఇంటి పరిసరాల్లోను నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.క్రమం తప్పకుండా శానిటేషన్ పనులు నిర్వహించాలని పేర్కొన్నారు .కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కె. సూరిబాబు,వీఆర్వో రాయుడు,వంగ వీరభద్రరావు, టిడిపి పార్టీ సీనియర్ నాయకులు చుండ్రు వీర్రాజు చౌదరి, చవ్వాకుల నారాయణమూర్తి, పేపకాయల బాబ్జి, మాజీ సర్పంచ్ వనం వీరబ్రహ్మం, నక్క శ్రీనివాస్, అంగర కృష్ణ, మాధవరపు శ్రీరామచంద్రమూర్తి, పంచాయతీ కార్యదర్శులు కె.వి రవి ప్రసాద్, వీఆర్వో శ్రీను, శ్రావణి, కార్యదర్శి ఎండి జలాల్, డి ప్రతాప్, కే అనంతలక్ష్మి, కోట తాతబ్బాయి, శనపల ధనరాజ్, పెంకె అప్పారావు, సాయిబాబు ,వల్లు అర్జున్ రావు,వీఆర్వోలు, ఏఎన్ ఎం లు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన

# శాసనసభ్యులు బండారు



**ఆలమూరు, పెన్ పవర్,మే31 :**
శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కూటమి ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ముమ్మిడివరం మండలం సిహెచ్ గున్నేపల్లి, కాట్రేనికోన మండలం చెయ్యేరులో జరగనున్న వివిధ ప్రభుత్వ కార్యక్రమాల కోసం జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గున్నేపల్లి ఓఎన్జిసి సైట్లో ఏర్పాటుచేసిన హెలీ ప్యాడ్ వద్ద కలుసుకొని ఆయనకు ఘన స్వాగతం పలికినట్లు ఆలమూరు కుటమి నాయకులు తెలియజేశారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బస్సులో ప్రయాణం చేసి సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

# జూన్ 4న 'వెన్నుపోటు దినం' విజయవంతం చేయాలి

## సీసాగుడకు మంచినీటి సౌకర్యం కల్పించాలంటూ గాలి. బిందెలతో నిరసన.



**అనంతగిరి పెన్ పవర్ మే 31.** టోకూరు పంచాయతీ సిసాగుడ గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ పెసా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో కాలి బిందెలతో నిరసన చేసిన ఆ గ్రామ పెషా ఉపాధ్యక్షులు కిల్లో నాయుడు, సారా సుబ్రమణ్యం మాట్లాడుతూ సోలార్ స్కీం మూలకు చేరిందని, సిసాగుడ గ్రామస్తులు త్రాగు నీరు కి అనేక ఇబ్బందులు పడుతున్నారని, దూరప్రాంతమైన భగ్మరవలస లేదా టోకూరు గ్రామల కు వెళ్లి మంచినీరు సేకరిస్తున్నట్లు, ఇది వరకే సిసాగుడ గ్రామానికి మంచినీటి సమస్య పరిష్కరించాలని పలు మార్లు సర్పంచ్ ద్వారా ఆర్ డబ్ల్యు ఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, డీఈఈ, జె ఈ ఈ ఎవ్వరన్నది నేటికీ తెలియని పరిస్థితులున్నాయి, వారు ఆవేదన వ్యక్తం చేశారు జల్ జీవన్ మిషన్ ద్వారా బోరు కూడా తవించడం జరిగిందని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే మా గ్రామంలో శాస్వత మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి ఆర్ డబ్ల్యు ఎస్ ఆఫీష్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మహిళలు పాంగి రత్నమ్మ రామచంద్రరావు రఘురామ్ తదితరులు పాల్గొన్నారు

## పింఛన్ లు పంపిణీ చేసిన పీసా మండల అధ్యక్షులు,తెలుగు దేశం ఎస్. టి సెల్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ చప్పలి శంకర్ రావు





**హుకుంపేట పెన్ పవర్ మే 31 :** అల్లూరి సీతారామరాజు.జిల్లా, హుకుంపేట మండలం లోని, రాప పంచాయితీ పరిధి లివిటి గ్రామం లో సామాజిక పింఛన్ లను పీసా హుకుంపేట మండల అధ్యక్షులు, టీడీపీ అరకు అసెంబ్లీ ఎస్టీ సెల్ ఆర్గ నైజింగ్ సెక్రెటరీ చప్పలి శంకర్ రావు, వైస్ సర్పంచ్ గంజాయి మోహన్ బాబు తో కలిసి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో చప్పలి శంకర్ రావు మాట్లాడు తూ... రాష్ట్రం లో ఆర్థిక కష్టాలు ఎన్ని ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా తీసుకుని పింఛన్ లు పంపిణీ చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో... టీడీపీ సీనియర్ నాయకులు కిండంగి సత్య, పింఛన్ దారులు గంగమ్మ, చిట్టిబాబు, సోమన్న, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు వినియోగం తగ్గించండి - తోటి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి

- యువత ధూమపానం నుండి బయట పడాలి
- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్




**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 31:** పొగాకు ఉత్పత్తులు సేవించడం వలన, సేవించిన వారికే కాకుండా ప్రక్కన ఉన్న వారిపై కూడా ప్రభావం పడి అనేక దుష్పరిణామాలు కలుగుతాయని,పొగాకు వినియోగం తగ్గించి తోటి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పిలుపు నిచ్చారు.శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పాత బస్ స్టాండ్ అంబేద్కర్ కూడలి నుండి ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించారు.ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ,పొగాకు వినియోగం,ధూమపానం వలన నోటి, ఊపిరితిత్తుల కేన్సర్ వచ్చే అవకాశముందన్నారు. వినియోగదారులు అవగాహనతో చైతన్యవంతులు కావాలని తద్వారా పొగాకు వినిమయాన్ని అరికట్టాలని కోరారు.ముఖ్యంగా యువత ధూమపానం,మత్తు పదార్థాల వినియోగం విడనాడాలని సూచించారు. కళాశాలలు, పాఠశాలలు, బహిరంగ ప్రదేశాలలో పొగాకు వస్తువులు విక్రయం, వినియోగం నియంత్రించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిలా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.జమాల్ బాష,ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. హేమలతా దేవి, డిఎస్పి షేక్ షేహబాజ్ అహమ్మద్, పలువురు డాక్టర్లు,పారా మెడికల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.






- ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు పిలుపు

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 31:**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి నిలువునా ముంచిందని విమర్శించిన అల్లూరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి యొక్క ఆదేశాల మేరకు జూన్ 4న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబోయే "వెన్నుపోటు దినం" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ మేరకు పాడేరు క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి కూటమి నేతృత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు గాలికి వదిలి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై కక్ష సాధింపు ధోరణితో తప్పుడు కేసులు, దాడులు, హత్యలు జరుపుతున్నారు. మహిళలపై, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోయాయి. అవినీతి పెరగడమే కాక, సంక్షేమం గురించి మరిచి, ప్రభుత్వ హామీలను తుంగలో తొక్కి, సొంత లాభాల కోసం పరిపాలన కొనసాగుతోంది," అని తీవ్రంగా విమర్శించారు.ఈ సమావేశంలో అరకు శాసన సభ్యులు రేగం మత్స్యలింగం జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర,అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్, మాజీ శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మాజీ పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి పాల్గొన్నారు. అనంతరం "వెన్నుపోటు దినం" పోస్టర్ను ఆవిష్కరించారు.మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గంలోని శాసనసభ్యులు, మాజీ శాసనసభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పిటిసిలు, కార్యకర్తలు అందరూ ప్రజలతో కలిసి జూన్ 4 నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాడేరు,అరకు నియోజకవర్గాల అనుబంధ విభాగాల నాయకులు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు,పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బదిలీపై వెళ్తున్న డీఈఈ దుర్గ శ్రీనివాసరావుకు ఘన సన్మానం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మే31:**గూడెం కొత్తవీధి మండలం సీలేరు కాంప్లెక్స్ క్యాంపు డీఈఈగా పనిచేసి బదిలీ అయిన దుర్గ శ్రీనివాసరావుకు శనివారం సాయంత్రం ఏపీ జెన్కో అధికారులు ఘనంగా సన్మానించారు. సీలేరు జెన్కో అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ ఈ చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ ఈ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సీలేరు క్యాంపు సబ్ డివిజన్లో డీఈఈగా పదవీ బాధ్యతలు నిర్వర్తించిన కాలంలో విశేషంగా సేవలందించారని, ఒక ప్రక్క ప్రజలతో దగ్గరుండి, మరో పక్క సబ్ డివిజన్లో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో పెద్దన్న పాత్ర పోషించారని అన్నారు. అదేవిధంగా సర్కిల్ అధికారులతో కూడా కలిసి సమస్యలు సమన్వయం చేసుకుంటూ స్థానికుల నుంచి ఎటువంటి సమస్య రాకుండా తన పరిధిలో పరిష్కరించావారని అన్నారు. ఈఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తన దగ్గర పనిచేసే ఒక మంచి అధికారి బదిలీపై వెళ్లిపోవడం బాధగా ఉందని, అయితే బదిలీలు ఉద్యోగ జీవితంలో సాధారణం కావడంతో బదిలీలు తప్పవని అన్నారు. ఏఈఈ సురేష్ మాట్లాడుతూ డీఈఈ దుర్గ శ్రీనివాసరావు దగ్గర పనిచేయడం తనకు అదృష్టమని, అతని దగ్గర చాలా నేర్చుకున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈఈ రాజేంద్రప్రసాద్, బాస్కరరావు,డీఈఈ అప్పలనాయుడు,జయపాల్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార శాఖ ఇంజనీర్ మల్లికార్జునరావు సేవలు ఆదర్శనీయం: ఎస్.వి. రమణ







**విశాఖపట్నం, పెన్ పవర్ మే 31:** సమాచార పౌర సంబంధాల శాఖలో అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్గా విశిష్ట సేవలందించిన సి.హెచ్. మల్లికార్జునరావును జిల్లా పౌర సంబంధాల అధికారి ఎస్.వి. రమణ అభినందించారు. శనివారం జిల్లా కార్యాలయంలో జరిగిన మల్లికార్జునరావు పదవీ విరమణ సభలో ఆయన మాట్లాడుతూ, "మల్లికార్జునరావు 33 సంవత్సరాల దీర్ఘకాలిక సేవలో ఎల్లప్పుడూ నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ వరకు రెండు రాష్ట్ర అసెంబ్లీ లలోనూ తన ప్రతిభతో ఆదర్శంగా నిలిచారు," అని కొనియాడారు.

ఈ సందర్భంగా ప్రాంతీయ సమాచార ఇంజనీర్ కార్యాలయపు సూపరింటెండెంట్ అన్నమ్మ మాట్లాడుతూ, "మల్లికార్జునరావు ఒక నిబంధనలకు కట్టుబడిన వ్యక్తి మాత్రమే కాకుండా, మృదుస్వభావి. సూచనలతో సాన్నిహిత్యాన్ని ప్రదర్శిస్తూ, సహాయ సహకారాలే ప్రధానమని నమ్మిన వ్యక్తి," అని తెలిపారు. డివిజనల్ పీఆర్వో నారాయణరావు మాట్లాడుతూ, "వృత్తిపట్ల అంకితభావంతో పాటు, సహోద్యోగులతో ఉన్న సత్సంబంధాలతో మల్లికార్జునరావు అందరికీ ఆదర్శంగా నిలిచారు," అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ బాలాజీ, ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకట్రావు, సీనియర్ అసిస్టెంట్ మాధవి, పీఆర్వో కిషోర్, పాత్రికేయులు శ్రీనివాసరావు, భగవాన్ తదితరులు మల్లికార్జునరావు సేవలను ప్రశంసించారు. అనంతరం మల్లికార్జునరావు దంపతులను ఘనంగా సత్కరించారు.

ఈ సభలో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, రాష్ట్ర సమాచార కేంద్రం, ప్రాంతీయ సమాచార ఇంజనీర్ కార్యాలయం, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాట తప్పని కూటమి ప్రభుత్వం

- పెన్షన్ పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ %d% కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి.

**గుమ్మలక్ష్మీపురం. మే 31 పెన్ పవర్.**మండల కేంద్రంలో కొండవీధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ %d% కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి. పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ప్రతినెల ఒకటవ తేదీనే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ ఇస్తున్నామని, రేపు ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే ఇస్తున్నామని ఆమె అన్నారు. అలాగే సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాడి సుదర్శన్ రావు, ఎంపీడీవో సాల్మన్ రాజ్, కూటమి నాయకులు చిన్న, రాజేష్, మన్మథ, దివాకర్, దొర, సచివాలయ సిబ్బంది, కూటమి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క రోజు ముందుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం మే 31:**కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నటువంటి ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ ను తూర్పు నియోజకవర్గం 12 వ వార్డులో అర్హులైన వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు జూన్ ఒకటో తారీఖు ఆదివారం సెలవుదినం కారణంగా ఒక్క రోజు ముందుగానే అనగా 31 వ తారీఖున ఉదయం ఇంటి వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ అందించడం జరిగింది. పెన్షన్ పొందినటువంటి ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వానికి ఆనాటి చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ లకు అలాగే స్థానిక శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు గారికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగిందని వార్డు ఇంచార్జ్ ఒమ్మి అప్పలరాజు. తెలియజేశారు. చివరి ఉదయం కార్యక్రమంలో 12 వ వార్డు అధ్యక్షులు గాడి సత్యం,జిల్లా పార్లమెంట్ కమిటీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, పోలరావు కొత్తలి గోపాల్,పండిరి నర్సింగు,పైడి మళ్లేశ్వర్రావు, రాగుల తిమోతి,గోపల్లి రామకృష్ణ,రాపర్తిగణపతి రాజు,ఇల్లా లక్ష్మి,షారోని, సచివాలయ సిబ్బంది బి. కిషోర్, షేక్ యాసిన్,ఎస్ఎం పద్మ,వీఆర్ఒ. శ్రీనివాస్, రామలక్ష్మి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

- ప్రమాద బీమా కల్పించుటకు కృషి చేస్తాం.
- టీడీపీ మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, మండల టీడీపీ సెక్రెటరీ కే జగత్ రాయ్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మే 31.**మండలంలోని గల మాకవరం పంచాయతీ అల్లంగిపడ గ్రామానికి చెందిన కుయిలంగి నీలంబరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. నీలంబరం కుటుంబానికి శనివారం మండల టీడీపీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొంతేరి జగత్ రాయ్, టీడీపీ శ్రేణులు పరామర్శించి బియ్యం బస్తాలు, నిత్యవసర సరుకులతో పాటు మూడు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షురాలు సన్యాసమ్మ మాట్లాడుతూ.. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నీలంబరం మంచి మనసున్న టీడీపీ కార్యకర్త అని, ఆయన మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. ప్రభుత్వం నుండి ప్రమాద బీమా వచ్చు లాగున కృషి చేస్తామని, కుటుంబాన్ని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుడు నీలంబరం పెద్దకర్మ కు అన్ని విధాలుగా సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఉపాధ్యక్షుడు బాబూజీరావు, మండల మాజీ అధ్యక్షుడు కే బలరాం, టీడీపీ నేతలు వంతాల రామస్వామి, ఎన్ శంకర్రావు, ఆర్ కొండలరావు, ఎం రఘుపతి పడాల్, కే లోబ్బో, ఉర్జైట్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మితంగా తనిఖీ చేసిన ప్రభుత్వ విప్.





**గుమ్మలక్ష్మీపురం మే 31 పెన్ పవర్.** పార్వతీపురం మన్యం జిల్లా.గుమ్మలక్ష్మీపురం మండలం.తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి శనివారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై నేరుగా వారితో మాట్లాడి తెలుసుకున్నారు.

హాస్పటల్ స్టాఫ్ రిజిస్టర్ మరియు మందుల స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతూ ఆసుపత్రిలో కావలసిన మందులను ముందుగానే ఇండెంట్ పెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు.

వస్తున్నది వర్షాకాలం కావున జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, వైద్యులు, వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలను అందించాలని, అలాగే రోగులకు రిఫరెన్సులు తగ్గించి ఇదే హాస్పిటల్ లో వీలైనంతవరకు చికిత్స అందించాలని వైద్యులకు ఆమె సూచించారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, లుంబేసు మాజీ సర్పంచ్ తోయక జమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలించిన జెన్కో అధికారులు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 31:** అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మించే ప్రాంతాలను విద్యుత్సేధా నుంచి వచ్చిన అధికారుల బృందం శనివారం పరిశీలించింది.ఏపీ జెన్కో కేంద్ర కార్యాలయం విద్యుత్ సౌధా నుంచి చీఫ్ ఇంజనీర్ (సివిల్) రవీంద్రారెడ్డి, చీఫ్ ఇంజినీరు(హైడల్) నాగరాజుల ఆద్వర్యంలో అధికారులు శనివారం సీలేరు చేరుకుని ముందుగా పార్వతీనగర్కు చేరుకుని జలవిద్యుత్కేంద్రం నిర్మించే ప్రదేశంను పరిశీలించారు. అక్కడ నుంచి శాండీకొరి వద్ద నీటిని పంపింగ్ చేసే విదానంపై గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.సీలేరుకు సమీపంలో డంపింగ్ యార్డుకు ప్రతిపాదించిన ప్రదేశంను అధికారులు పరిశీలించారు. సీలేరు జలాశయం వద్ద నిర్మించనున్న అండర్గ్రౌండ్ పైపు లైన్ మొదలయ్యే ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు.ఇందుకు సంబంధించి విద్యుత్ సౌథా నుంచి వచ్చిన అధికారుల బృందానికి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు గురించి డ్రాయింగ్లతో వివరించారు. అక్కడ నుంచి సీలేరు జల విద్యుత్కేంద్రానికి చేరుకుని జలవిద్యుత్కేంద్రంలో యూనిట్లు పనితీరు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# చింతపల్లిలో అక్రమ నిర్మాణాలు తొలగింపు.

తహశీల్దార్ రామకృష్ణ నేతృత్వంలో ప్రత్యేక డ్రైవ్.



**చింతపల్లి పెన్ పవర్ మే 31:** –చింతపల్లి మండలంలోని హనుమాన్ జంక్షన్ నుండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వరకూ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూములపై వ్యాపారులు అక్రమంగా నిర్మించుకున్న కట్టడాలను అధికారులు శనివారం కూల్చివేశారు. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్టు తహశీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తిగా భావించి వాటిని రక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉందని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవడమే కాక, భవిష్యత్తులో ఇలాంటి చర్యలు మరింత గట్టిగా కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ తొలగింపు కార్యకలాపాలకు తహశీల్దార్ నేతృత్వంలో రెవెన్యూ శాఖ మరియు పోలీస్ శాఖ సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు చేయబడింది. సీఐ వినోద్ బాబు, ఎస్సై వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా చర్యలు చేపట్టారు. ప్రతి శనివారం ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఇలాంటి అక్రమాల తొలగింపు కొనసాగుతుందని, వ్యాపారులు, స్థానికులు సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సుభాకర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎం. కృష్ణమూర్తి, వీఆర్వో పండన్న తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాల తొలగింపులో సమన్యాయం పాటించండి.

పీసా కమిటీ మండల అధ్యక్షుడు రామకృష్ణ.

**చింతపల్లి పెన్ పవర్ మే 31 :-** ప్రభుత్వ స్థలాలలో అక్రమ కట్టడాల తొలగింపులో అందరికీ సమన్యాయం చేయాలని పీసా కమిటీ మండల అధ్యక్షుడు దూరి రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో మండల స్థాయి పీసా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి మండల కేంద్రంలో రహదారులు భవనముల శాఖ తో పాటు, ఇతర ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలను సక్రమముగా తొలగించాలని, అదే క్రమంలో ప్రతి ఒక్కరికి సమన్యాయం చేయాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. 17 పంచాయతీల కార్యదర్శులు గ్రామసభలలో విధిగా పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు ఉండేలా చూడాలని మండల అధికారులకు వివరించడం జరిగిందన్నారు.




ఈ కార్యక్రమంలో కొర్ర పేతురు గబులంగి నాగేశ్వరరావు, ఎస్ రామారావు, మొట్టడం వెంకటరమణ, మామిడి రామారావు, పిసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# అక్రమాలను స్వచ్ఛందంగా తొలగించండి



సర్పంచ్ దురియా పుష్పలత

జడ్పిటిసి పోతురాజు బాలయ్య

**చింతపల్లి పెన్ పవర్ మే 31:.** చింతపల్లి మండల కేంద్రంలో అక్రమంగా ఉన్న స్థలాలు కోర్టు ఆదేశాలు మరియు జిల్లా కలెక్టర్ నేడు చింతపల్లి మండల కేంద్రంలో గల అన్ని దుకాణ సముదాయము స్వచ్ఛందంగా తొలగించాలని సర్పంచ్ దురియా పుష్ప లత,జెడ్పిటిసి పోతురాజు బాలయ్య, జల్లి సుధాకర్ వర్తక సంఘం నాయకులు బేతాళుడు, నాగేశ్వర్ రావు మరియూ గ్రామ పెద్దలు పట్టణమంతా కలియతిరిగి స్వచ్ఛందంగా తొలగింపుకి సహకరించాలని కోరారు. పాడేరు శాసనసభ్యులు వారి అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్ వారు స్థానిక అధికారులకు దుకాణ సముదాయాలు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా తొలగించుకునేందుకు రెండు మూడు రోజులు అవకాశం ఇవ్వాలని సూచించారు ఈ సదా అవకాశాన్ని మండల కేంద్రంలో ప్రతి ఒక్క వ్యాపారస్తులు గృహస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరడం జరుగుతుంది

# మలేరియా పట్ల అప్రమత్తత- రియల్ టైంలో సమాచారం అందించండి

- జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్





**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే31:** వర్షాకాలంలో దోమల వల్ల తరచూ సంభవించే మలేరియా డెంగ్యూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆయా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి డోర్ టు డోర్ ఫీవర్ సర్వే నిర్వహించాలని,జ్వరాలు ఉంటే వారి నుండి శాంపిల్స్ కలెక్ట్ చేయాలని వారికి చికిత్స అందించాలని సూచించారు. ముఖ్యంగా పివిటిజి గ్రామాలు హిల్ టాప్ గ్రామాలు మారుమూల గ్రామాలలో సైతం పంచాయతీరాజ్, అర్డబ్ల్యూఎస్,మెడికల్ శాఖల ఆధ్వర్యంలో తప్పనిసరిగా ప్రతి ఇంటా బయట స్ప్రేయింగ్ నిర్వహించాలని ఆదేశించారు.రానున్న 90 రోజులు కీలకమైనందున జిల్లా కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోనూ, ఐటిడిఎల ప్రాజెక్టు అధికారుల కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేయాలన్నారు.మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని,యుద్ధ ప్రాతిపదికన స్ప్రేయింగ్ చేయాలని ఆదేశించారు.ప్రతి 15 రోజులకు ఒకసారి వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు తెరవక ముందే పాఠశాలలు వసతి గృహాలలో స్ప్రేయింగ్ నిర్వహించాలన్నారు. అదేవిధంగా పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు తల నుండి పాదం వరకు వరకు పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించాలని ఆదేశించారు. అదే విధంగా వాటర్ ట్యాంకులను క్లీన్ చేయడం ట్యాంకులలో క్లోరిన్ వేయడం కాలువల్లో చెట్టాలు తొలగించడం, మురికి కూపాలను నిర్మూలించడం తదితర చర్యలు ద్వారా మలేరియా నిర్మూలించాలని ఆదేశించారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన రియల్ టైంలో తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, అర్డబ్ల్యూఎస్ అధికారి కే.జవహర్ కుమార్, డీఈవో పి.బ్రహ్మాజీరావు, వర్చువల్ విధానంలో మూడు ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు డాక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ, కె. సింహాచలం, అపూర్వ భరత్, జిల్లా మలేరియా అధికారి తులసి,తదితరులు పాల్గొన్నారు.

# కొమ్మంగి రామాలయానికి వెండి శతకోపం బహుకరణ.



**చింతపల్లి పెన్ పవర్ మే 31:** చింతపల్లి మండలం కొమ్మంగి గ్రామ దేవత శ్రీరామాలయానికి ఓ పవిత్ర ఘట్టం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పండ వరలక్ష్మి (చిన్ని) కొయ్యూరు మండలం ధర్మవరం ఎంపీపీ పాఠశాలలోఉపాధ్యాయురాలుగావిధులునిర్వహిస్తున్నారు.

ఆలయానికి 20 తులాల వెండి శతకోపాన్ని బహుకరించి తన భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొనిఆమెనుఅభినందించారు. పండ వరలక్ష్మి చేసిన ఈ కార్యాన్ని గ్రామ ప్రజలు హర్షాతిరేకాలతోస్వాగతించారు. భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచే విధంగా ఉన్న ఈ విరాళం, దేవాలయ అభివృద్ధికి తోడ్పడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# 98 వార్డులలో రేబిస్ నిర్మూలన టీకా కార్యక్రమం





- స్పెషల్ డ్రైవ్ ద్వారా వీధి కుక్కలకు రేబిస్ నిర్మూలన వ్యాక్సిన్ టీకా కార్యక్రమం
- పి హెచ్ సి లలో అందుబాటులో యాంటీ రేబిస్ వ్యాక్సిన్:
- ఏఎం హెచ్ఓ ప్రధాన పశు నియంత్రణ అధికారి కిషోర్ కుమార్.

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం మే 31:** జీవీఎంసీ 98 వార్డులలో శనివారం నుండి యానిమల్ లవర్స్ ఆధ్వర్యంలో వీధి కుక్కలకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ స్పెషల్ డ్రైవ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని వీధి కుక్కలను సంరక్షించేందుకు యానిమల్ లవర్స్ తప్ప ఎవరూ పట్టించుకోలేని పరిస్థితి ఉందని,మనుషులకు గాని కుక్కలకు గాని రాబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉన్న కారణంగా. కమిషనర్,సి ఎం ఎన్ హెచ్ ఓ ఆదేశాల మేరకు శనివారం నుండి వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవర్ను ప్రారంభించామని 98 వార్డులలో తమ సిబ్బంది ద్వారా ప్రతి వార్డుకు వెళ్లి యానిమల్స్ లవర్స్ సమక్షంలో వ్యాక్సినే వేయడం జరుగుతుందని,పీహెచ్సీలో అందుబాటులో వ్యాక్సిన్ యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ఉంటుందని, అవసరమైన వారు ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ వేయించుకోవాలని,ముఖ్యంగా వీధి కుక్కలకు గుర్తించి వ్యాక్సిన్ వేయించాలని రెండు నెలల కాలం జీవీఎంసీ తమ సేవలను అందించడం జరుగుతుందని, ఏ ఎం అండ్ హెచ్ ఓ మరియు ప్రధాన పశు నియంత్రణ అధికారి కిషోర్ కుమార్ తెలియజేశారు. జీవీఎంసీ జోన్ 2 పరిధి 12 వార్డులో పెద్దగదిలి కూడలి వద్ద జీవీఎంసీ ఆధ్వర్యంలో రేబిస్ నిర్మూలన టీకా ప్రారంభోత్సవ కార్యక్రమానికి జీవీఎంసీ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఏ ఎన్ వి నరేష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వి ఎస్ పి సి ఏ ప్రతినిధులు శారదా దేవి. యానిమల్స్ లవర్స్ అయిన ప్రదీప్ రాజ్ సమంత.ప్రదీప్

టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బుడుమూరి గోవింద్. జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# హుకుంపేట వైసీపీ శ్రేణులతో అత్యవసర సమావేశం.

**హుకుంపేట పెన్ పవర్ మే 31** అరకు నియోజకవర్గంహుకుంపేట మండలంలో అరకు శాసనసభ్యులు రేగం మత్స్య లింగం ఆధ్వర్యంలో మండల కేంద్రం పరిధిలో గల హుకుంపేట సంత షెడ్ దగ్గర జూన్ 01 మధ్యాహ్నం 2:30 గంటలకు మండలానికి చెందిన వైసిపి నాయకులతో అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు వైసీపీ హుకుంపేట మండల పార్టీ అధ్యక్షుడు పాంగి. అనిల్ తెలిపారు.



కావున ఈ సమావేశానికి హుకుంపేట మండలానికి చెందిన ఎంపీపీ,జడ్పిటిసి,ఎంపీటీసీలు,సర్పంచులు,పార్టీ అనుబంధ విభాగం శ్రేణులు,మండల స్థాయి నాయకులు కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని అయన అన్నారు

# టీ ఇచ్చి.. ఆపై పింఛను అందించి

**పింఛను లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరించిన హోం మంత్రి అనిత**

**లబ్ధిదారుల యోగక్షేమాలు తెలుసుకుంటూ పింఛన్ల పంపిణీ**

**నక్కపల్లి, పెన్ పవర్ విశాఖపట్నం మే 31:**పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తరువాత గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామస్థులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే ఆపరేషన్ చేయించుకున్న టిడిపి కార్యకర్త ఆవాల నాగేశరరావును పరామర్శించారు. అనంతరం గోవింద్ ఇంటికి వెళ్లిన మంత్రి అనిత.. స్వయంగా టీ కాచి, ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా, రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ప్రజలు పెట్టిన భిక్షతోనే నేను ప్రజలకు సేవ చేస్తున్నాను అని అన్నారు. రేపు ఆదివారం సెలవు కావడంతో, ఫించన్‌లను ఒకరోజు ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

పాయకరావుపేట పట్టణంలో అన్నా క్యాంటీన్‌కి శంకుస్థాపన చేయడం జరిగిందని, త్వరలో నక్కపల్లి ప్రభుత్వ హాస్పటల్ వద్ద కూడా అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జూన్ నెల నుంచి తల్లికి వందనం పథకం అమలులోకి వస్తుందని, మహిళలకు ఉచిత బస్సు పథకం ఆగస్టు 15 నాటికి ప్రారంభం కానుందని చెప్పారు. తాగునీటి, సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు లక్ష ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టాల్లో ఉన్నా, ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు.ఉద్దండపురం జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సీసీ కెమెరాలు, స్టాఫ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను హోం మంత్రి అనిత ఆదేశించారు.

# రాజకీయాల్లో ఏక్ నిరంజన్...



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ లో కల్వకుంట్ల కవిత కాక మామూలుగా లేదు. నిజమే రక్త సంబంధం.. ఆప్యాయతలు.. రాఖీ పండగలు.. ఇవన్నీ ట్రాష్. రాజకీయాలలో పదవులు, అధికారం, ఆధిపత్యమే ముఖ్యం. తెలుగు రాష్ట్రాల్లో ఇది మరోసారి రుజువయింది. అధికారంలో ఉన్ననాళ్లు కలసి మెలిసి ఉన్నట్లు లేనిపోని ప్రేమలు పంచుకున్న వారే అధికారం కోల్పోయిన తర్వాత పగ పెంచుకుంటున్నారు. మరి తేడా అస్తుల వల్ల వచ్చిందా? లేదా పార్టీలో తమకు కూడా పార్ట్ నర్ షిప్ ఇవ్వాలని కోరుకోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందన్నది తెలియదు కానీ రెండు తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇది సర్వసాధారణమయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లు విడిపోయిన తర్వాత జరుగుతున్న ఈ పరిణామాలు రెండు పెద్ద కుటుంబాలను నడిరోడ్డు మీదకు నెట్టేశాయి. అక్కడా .. ఇక్కాడా సేమ్ పాలిటిక్స్.. కాకుంటే క్యారెక్టర్ యాక్టర్లు వేరు. పొలిటికల్ సీన్ మాత్రం సేమ్ టు సేమ్. ఒకరు కొన్ని దశాబ్దాల పాటు పోరాడి.. చివరకు పార్టీని అధికారంలోకి తెచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం. అదే సమయంలో తెలంగాణ కోసం దశాబ్దాల పాటు పోరాటం చేసి సాధించి తెచ్చిన కేసీఆర్ కుటుంబం. ఇద్దరు నేతలకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. వారి పోరాటం అందరికీ స్ఫూర్తి. ఎందుకంటే అసమాన్యమైన ఘనతను సాధించి చరిత్ర సృష్టించారు. అయితే కాంగ్రెస్ పార్టీ పూర్తిగా రాజకీయంగా ఇబ్బందుల పడుతున్న వేళ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పార్టీని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పదేళ్ల పాటు కాంగ్రెస్ ను అధికారంలోకి తేగలిగారు. ఇక రాదు రాదు అనుకుంటున్న తెలంగాణ ను తెచ్చిన కేసీఆర్ కూడా బీఆర్ఎస్ ను దాదాపు పదేళ్ల పాటు అధికారంలో ఉంచారు. 2014లో వైసీపీ అధికారంలోకి రాకపోయినా అన్నా చెల్లెళ్లయిన జగన్, షర్మిల మధ్య విభేదాలు తలెత్తలేదు. జగన్ జైలుకు వెళ్లినప్పుడు షర్మిల పార్టీ వ్యవహారాలను చూసుకోవడమే కాకుండా పాదయాత్ర కూడా చేశారు. 2019 ఎన్నికలలో అధికారం వచ్చిన తర్వాత మొదలయిన అన్నా చెల్లెళ్ల మధ్య విభేదాలు2024 లో ఓటమి తర్వాత విడిపోయే పరిస్థితికి తలెత్తాయి. జగన్, వైఎస్ షర్మిల మధ్య రాజకీయ వైరుధ్యమే కాదు. ఆస్తి తగాదాలు కూడా తోడవ్వడంతో ఇద్దరూ ఉప్పు నిప్పులా తయారయ్యారు. ఇద్దరి దారులు వేరు అయ్యాయి. తండ్రి వైఎస్ మరణం తర్వాత తల్లి విజయమ్మ ఎటూ తేల్చుకోలేని స్థితిలో చివరకు కూతురు పంచన చేరిపోయారు. ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో అన్నాచెల్లెళ్లయిన వైఎస్ జగన్, వైఎస్ షర్మిల ఇద్దరు వేర్వేరు పార్టీల్లో ఉంటూ అధికారం కోస ప్రయత్నిస్తున్నారు. జగన్ ను ఓడించడమే లక్ష్యంగా గత ఎన్నికల్లో షర్మిల పనిచేశారంటే ఇక వారు కలవడం అనేది కుదరదన్నది స్పష్టమయింది. ఇక తాజాగా తెలంగాణలోనూ 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండటంతో పెద్దగా ఇబ్బందులు ఎదురు కాలేదు. కేటీఆర్ రాష్ట్ర మంత్రిగా, కవిత నాడు ఎంపీగా ఢిల్లీ రాజకీయాలకు పరిమితమయ్యారు. అయితే 2019 ఎన్నికల్లో కవిత ఎంపీగా ఓడిపోవడంతో పాటు 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలు కావడంతో అన్నా చెల్లెళ్ల మధ్య గొడవలు తారా స్థాయికి చేరుకున్నాయి. కవిత నేరుగా కేటీఆర్ ను విమర్శిస్తూ మాట్లాడుతున్నారంటే ఆమె టార్గెట్ అన్న అని అర్థమవుతుంది. అన్న తనను తండ్రికి దూరం చేస్తున్నారని, పార్టీలో తనకు, తన వారికి ప్రాధాన్యత ఇవ్వకపోవడానికి సోదరుడు కేటీఆర్ కారణమని నమ్ముతున్నారు. అందుకే ఆమె బరస్ట్ అవుతున్నారు. ఇక వీరిద్దరూ కలసి నడిచేది కాదన్నది నేడు కవిత చేసిన వ్యాఖ్యలతో అర్థమయింది. కేసీఆర్ కళ్ల ముందే కూతురు, కొడుకు కొట్లాట ఆయనకు మాత్రం తలనొప్పిగా తయారయిందనే చెప్పాలి. మొత్తం మీద అన్నా చెల్లెళ్ల ఆధిపత్య పోరు రెండు తెలుగు రాష్ట్రాల్లో మాత్రం హాట్ టాపిక్ గా మారింది.

# ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్...

**హైదరాబాద్ పెన్ పవర్:** కడపలో నిర్వహించిన మహానాడు చివరి రోజు టీడీపీ జాతీయ అధ్యక్షుడి హొదాలో చంద్రబాబు సుదీర్ఘ ప్రసంగం చేశారు. సాధారణంగా చంద్రబాబు మైకు పట్టుకుంటే వదిలే రకం కాదన్న భావన ఉంది. ఈ దఫా కూడా అదే జరిగింది. అయితే.. ఈ సారి మైకు పట్టుకుని గంటల తరబడి ఆయన ప్రసంగించినా.. మెరుపులు కురిపించారు. ప్రజల్లో అభివృద్ధి బీజాలు వేశారు. దీంతో కృతకంగా సాగుతుందని ముందు అనుకున్నా.. చంద్రబాబు ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది.మరీ ముఖ్యంగ ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్ అనే నినాదాన్న అందుకుని చంద్రబాబు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. తద్వారా ఆయన ఎవరిని హెచ్చరించారో.. ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులకు మోడీ చెక్ పెట్టారని.. ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్ ద్వారా ఆర్థిక నేరస్తులను ఏరేస్తామని ఆయన శపథం చేశారు. ఇది మంచి పరిణామమే. అయితే.. ప్రస్తుతం ఉన్న రాజకీయాల్లో ఇది సాధ్యమేనా? అనేది ప్రశ్న.పైకి ఎన్నయినా చెప్పుకోవచ్చు. కానీ, ఎన్నికల విషయానికి వస్తే.. ప్రతి ఐదేళ్లకు ఎన్నికల ఖర్చు పెరుగు తూనే ఉంది. ఎక్కడా ఎవరూ తక్కువగా ఖర్చు చేస్తున్న దాఖలు కనిపించడం లేదు. అసెంబ్లీ నియోజక వర్గంలో 30 కోట్లు ఖర్చు పెట్టడం మంచి నీళ్ల ప్రాయంగా మారిన నేటి ఎన్నికల రాజకీయాల్లో క్లీన్ పాలిటిక్స్ అనే మాట.. వినేందుకు బాగానే ఉన్నా.. చేసేందుకు మాత్రం అడ్డంకులు సొంత పార్టీలోనే వినిపిస్తున్నాయి. తమకు డబ్బులు ముట్టలేదని.. తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల వేళ.. దాడులు చేసిన ఓటర్లు దీనికి ఉదాహరణ.ఒకవేళ.. తాను చెబుతున్న ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్‌ను ప్రత్యర్థుల వరకే పరిమితం చేయాలని అనుకుంటే.. అది సాధ్యం కావొచ్చు. కానీ.. సొంతపార్టీ పరిస్థితిని అంచనా వేసుకుంటే.. మాత్రం ఇది చేయలేక పోవచ్చు. అప్పుడు మళ్లీ చంద్రబాబుకు ఎదురు ప్రశ్నలు.. సవాళ్లు కూడా ఎదురవుతాయి. కాబట్టి.. ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్ అనేది పైకి చెబుతున్నంత ఈజీ కాదు.రాజకీయాల్లో నాయకులు ఉంటారు. వారికి ప్రత్యర్థులు కూడా ఉంటారు. అయితే.. ఎవరు ఎలాంటి వారు? అనేది తెలుసుకోవడం నాయకులకు.. పార్టీలకు కూడా తెలియాల్సి ఉంది. ఈ విషయంలో చాలా మంది నాయకులు తప్పులు చేస్తుంటారు. అందుకే.. వెనుకబడి పోతుంటారు. కానీ.. ఈ వ్యవహారంలో రాజకీయాలను తనకు అనుకూలంగా మార్చుకోవడంలో చంద్రబాబు స్టయిల్ వేరు. ఆయన దూకుడు వేరు. ఒకరకంగా చెప్పాలంటే.. చంద్రబాబు విశ్వరూపమే వేరు.ఈ విషయాన్ని జగన్ అంచనా వేయలేకపోతే.. పార్టీ పరిస్థితి మరింత దిగజారిపోతుందని పరిశీలకులు చెబుతున్నారు. చంద్రబాబు అంటే.. కేవలం నాయకుడు.. ఒక పార్టీ అధినేతగానే కాదు.. ఆయన ప్రజలను తనవైపు తిప్పుకోవడంలో దిట్ట. ప్రచారం చేయడంలో స్కాలర్. ప్రజలను మలుపుతిప్పుకొనే వ్యూహాలు వేయడంలోనూ.. ఆయన నెంబర్ 1. ఇది 2014, 2024 ఎన్నికల్లోనూ.. చంద్రబాబుకు కలిసి వచ్చింది. ఆయన దూకుడు, ప్రచారం వంటివి కలిసివచ్చాయి.అంతేకాదు.. రాజకీయాల్లో కావాల్సిన మరో కీలక అంశం ం పదిమందిని పోగు చేయడం. ఈ విషయంలోనూ చంద్రబాబు సక్సెస్ అయ్యారు. గత తన పాలనలో మేలు జరిగిన వారిని ముందుండి నడిపించారు. వారందరిని ఏకమయ్యేలా చేశారు. సొంత ఖర్చులు పెట్టుకుని ముందుకు ఉరికేలా చేశారు. నాయకులకు నిర్ణీత లక్ష్యాలు విధించారు. ఫలితంగా భారీ ప్రచారం.. భారీ యూటర్న్‌లు 2024లో స్పష్టంగా కనిపించాయి. మరీ ముఖ్యంగా ప్రత్యర్థి లోపాలను తెలుసుకోవడంలోనూ చంద్రబాబు సక్సెస్ అయ్యారు.ఇప్పుడు ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే.. వైసీపీ అధినేత జగన్‌కు పార్టీ వర్గాల నుంచి అందిన నివేదికల్లో ఓ కీలక నాయకుడు.. ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ప్రచార వ్యూహంలోనూ.. పార్టీని ప్రజలకు చేరువ చేయడంలోనూ.. జీరో నుంచి ప్రారంభించాలని 2024కు ముందు చంద్రబాబు ఇదేపని చేశారని ఆయన వెల్లడించారు. ఈ విషయంలోనే గత ప్రభుత్వంలో మేలు జరిగిన వారిని ఏకం చేసేలా చర్యలు ఉండాలని సూచించారు. చంద్రబాబు విశ్వరూపాన్ని తక్కువగా అంచనా వేయొద్దని.. కేవలం సింపతీని మాత్రమే నమ్ముకుంటే ఫలితం ఉండబోదని అంటున్నారు. మరి జగన్ ఏం చేస్తారో చూడాలి.చేస్తే.. మంచిదే. దీనికి చాలా సాహసం, ధైర్యం కావాలి. కానీ.. నిరంతర ప్రభుత్వం కోరుకుంటున్న దరిమిలా.. దీనిని ఏమేరకు సక్సెస్ చేస్తారన్నది చూడాలి.

# సర్వే బాట పట్టిన పవన్

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు ఏం చేసినా కొన్ని గణాంకాలు, పద్ధతులు పాటిస్తారు. ప్రతి విషయంలో ప్రజల నుంచి సంతృప్తిని కోరుకుంటారు. చివరికి మద్యంపైనా ఆయన సంతృప్తి పాళ్లను లెక్కించుకున్నారు. అంటే ఇది తప్పుకాదు, ప్రజల అభిప్రాయాలను అన్ని విషయాల్లోనూ తెలుసుకునే ప్రక్రియ. తద్వారా ప్రభుత్వ విధానాలను సమీక్షించి, అవసరమైతే మార్చుకునే ప్రయత్నం చేస్తారు. ఇదే విధంగా ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరును కూడా చంద్రబాబు అంచనా వేస్తూనే ఉన్నారు.ప్రజల అభిప్రాయాల మేరకు మార్పులు చేసుకుంటూ పాలనపై సంతృప్తిని సాధిస్తున్నారు. ఈ పరంపరలోనే కూటమి పార్టనర్ అయిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా సర్వేలు చేపడుతున్నారు. తన పార్టీ తరఫున ఆయనతో పాటు ముగ్గురు మంత్రులు ఉన్నారు. వారికి అప్పగించిన శాఖలు సహా తానే చూస్తున్న మూడు నాలుగు శాఖలలో అధికారుల పనితీరును తెలుసుకుంటున్నారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారు? తాము ఏమి చేస్తున్నారు? అన్న విషయాలను సర్వే రూపంలో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.తద్వారా ప్రజలకు%-%పాలనకు మధ్య తేడాలు ఉంటే వాటిని అరికట్టేందుకు, మరింత మంచి పాలనను అందించేందుకు అవకాశం ఉందని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. ఈ క్రమంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలపై కూడా పవన్ కళ్యాణ్ దృష్టి పెట్టారు. మంత్రులుగా ఉన్న ముగ్గురిని తీసేస్తే, జనసేనకు 18 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో నలుగురు నుంచి ఐదుగురి వ్యవహారం వివాదంగా మారిందని జనసేన కార్యాలయానికి ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. వ్యక్తిగతంగానే కాకుండా కూటమి పరంగా కూడా ఈ అంశాలు సమస్యలుగా ఉన్నాయి.కూటమి పార్టీలతో కలిసిపనిచేయకపోవడం, స్థానిక నాయకులతో సంబంధాలు లేకపోవడం, నియోజకవర్గంలో ఆధిపత్య రాజకీయాలు వంటి అంశాలు జనసేన నేతల దృష్టికి వెళ్లాయి. వచ్చే ఎన్నికల్లోనూ కూటమితోనే కలసి పోటీ చేస్తున్నామన్న క్లారిటీ రావడంతో పవన్ కల్యాణ్ నియోజకవర్గాల ఇన్ ఛార్జిల విషయంలోనూ ఆచి తూచి వ్యవహరిస్తున్నారట. అనవసరంగా ఎక్కువ మందిని నియమించుకుని, వారు ఏదో వివాదంలో చిక్కుకుని పార్టీకి, తనకు చెడ్డపేరు తెస్తారన్న భయం మాత్రం పవన్ కల్యాణ్ లో



కనిపిస్తుంది.అందుకే ముందుగా ఎంపిక చేసుకున్న నియోజకవర్గాల్లో నమ్మకమైన నేతలను, సుదీర్ఘకాలం నుంచి పార్టీతో నడుస్తున్న వారికి మాత్రమే ఇన్ ఛార్జి పదవులును కట్టబెడుతున్నారు. అంతే తప్ప 175 నియోజకవర్గాల్లో ఇన్ ఛార్జుల నియమించి, అక్కడ టీడీపీ, జనసేన లేదా బీజేపీ, జనసేనలకు మధ్య అనవసర వివాదాలు తలెత్తుతాయని భావిస్తున్నారు. అందుకే ఇప్పటి వరకూ చాలా నియోజకవర్గాల్లోనూ ఇన్ ఛార్జులు లేరు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ స్థానాలు పెరిగితే తాను తీసుకోవాల్సిన స్థానాలపై కూడా అంచనా రావడానికి ఒక సర్వే చేయించాలని కూడా పవన్ కల్యాణ్ సిద్ధమవుతున్నారని తెలిసింది. పేరున్న సంస్థ చేత సర్వేచేయించి జనసేనకు బలం ఉన్న యాభై నియోజకవర్గాల పేర్లను ఆయన తెప్పించుకోవాలని భావిస్తున్నారు.ఢిల్లీకి చెందిన సంస్థకు ఈ బాధ్యతలను అప్పగించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు సమాచారం. సర్వేలో వచ్చిన స్థానాలను అడిగి తీసుకునేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఆ సర్వే వచ్చిన తర్వాత ఆ స్థానాల్లో ఇన్ ఛార్జులు లేకపోతే అప్పుడు అక్కడ నమ్మకమైన వారిని నియమించడమా? లేదా తనకు దగ్గరగా ఉన్న నేతలను అక్కడ ఇన్ ఛార్జులుగా పెట్టడమా? అన్నది చేస్తారని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. యాభై నుంచి అరవై బలమైన అసెంబ్లీ స్థానాలతో పాటు ఐదు పార్లమెంటు స్థానాల పేర్లను కూడా తనకు సర్వే చేసి ఇవ్వాలని సదరు సంస్థకు పవన్ కల్యాణ్ బాధ్యత అప్పగించినట్లు తెలిసింది. అదే నిజమైతే వచ్చే ఎన్నికల్లో జనసేన ఐదు పార్లమెంటు, యాభై శాసనసభ నియోజకవర్గాల్లో పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఆ 18 మంది ఎమ్మెల్యేల పనితీరుపై జనసేన సర్వే చేపట్టాలని నిర్ణయించినట్టు సమాచారం. తద్వారా విమర్శలు వస్తున్న ఎమ్మెల్యేలు, కలిసిపనిచేయని ఎమ్మెల్యేలు కూడా మార్పు దిశగా తమను తాము మార్చుకుంటారని అంచనా వేస్తున్నారు. మరి ఈ సర్వేలో ఏం జరుగుతుందో చూడాలి.

# వంశీ స్థానంలో పంకజశ్రీ

**హైదరాబాద్ పెన్ పవర్:**
టీడీపీ టికెట్ పై ఎమ్మెల్యేగా గెలిచి.. ఆ తర్వాత అధికార వైసీపీ పంచన చేరి లెక్కలేనన్ని అక్రమాలకు పాల్పడ్డ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ రాజకీయ ప్రస్థానం ముగిసిందన్న వాదనలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. నిన్నటి దాకా అసలు రాజకీయం అంటేనే ఏమిటో తెలియకుండా%ొ% బయటి ప్రపంచానికే కనంపించకుండా ఉండిపోయిన ఆయన సతీమణి పంకజశ్రీ ఇప్పుడు ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు సిద్ధమైపోయారన్న వార్త మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ మేరకు శనివారం జరగనున్న గన్నవరం వైసీపీ నియోజకవర్గస్థాయి సమావేశానికి మాజీ మంత్రి పేర్ని నానితో పాటు పంకజశ్రీ కూడా హాజరు కానున్నారని, ఇందులోనే పంకజశ్రీ తన రాజకీయ రంగప్రవేశాన్ని ప్రకటిస్తారని సమాచారం.గన్నవరం నియోజకవర్గంలో ఏడాదిగా అసలు వైసీపీ కార్యక్రమాలే జరిగిన దాఖలా లేదు. 2024 ఎన్నికల్లో తనతో పాటు వైసీపీ కూడా చిత్తుగా ఓడటంతో గన్నవరం వదిలిన వంశీ నియోజకవర్గం వైపే చూడలేదు. తాజాగా పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఆయనను పోలీసులు హైదరాబాద్ వెళ్లి మరీ అరెస్టు చేసి విజయవాడ తరలించారు. కోర్టు ఆదేశాల మేరకు ఆయనను బెజవాడ జిల్లా జైలుకు తరలించారు. వంద రోజులకు పైగా వంశీ ఈ జైల్లోనే ఉంటున్నారు. అయితే అప్పటికే పలు అనారోగ్య సమస్యలు ఉన్న వంశీ%ొ% జైలు జీవితం కారణంగా మరింత అనారోగ్యానికి గురయ్యారు. గుర్తు పట్టలేనంతగా ఆయన మారిపోయారు. జైలు నుంచి బయటకు వచ్చినా వంశీ రాజకీయాల్లో యాక్టివ్ గా పాలుపంచుకుంటారా? అన్న దానిపై అందరిలోనూ అనుమానాలు ఉన్నాయి.వంశీ ఆరోగ్య పరిస్థితి, ఆయనపై నమోదై ఉన్న కేసులు, వాటి తీవ్రత తదితర అంశాలన్నింటినీ పరిశీలించిన వైసీపీ అధిష్ఠానం వంశీ స్థానంలో పంకజశ్రీని రంగంలోకి దించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇదే విషయాన్ని వంశీతో పాటు పంకజశ్రీకి చెప్పిన పార్టీ పెద్దలు%ొ% వారిని అందుకు ఒప్పించినట్లు సమాచారం. అయితే ఈ ప్రతిపాదనకు వంశీ తొలుత ఒప్పుకోకున్నా%ొ% ప్రస్తుత పరిస్థితులను ఆయన ముందు పెట్టగా అయిష్టంగానే ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. ఇక పంకజశ్రీ తన భర్తను కేసుల నుంచి కాపాడుకునేందుకు తాను రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వడం ఒక్కటే మార్గమన్న వైసీపీ నేతల వాదనలతో ఏమాత్రం ఆలోచించకుండానే ఒప్పేసుకున్నట్లు తెలుస్తోంది. విద్యావంతురాలైన పంకజశ్రీకి రాజకీయాలు కొత్తే అయినా.. పార్టీ మద్దతు ఉంటే రాణించే అవకాశాలున్నట్లు
విశ్లేషణలు సాగుతున్నాయి.వంశీని రిటైర్డ్ హర్ట్ చేసి%ొ% పంకజశ్రీని రంగంలోకి దింపే దిశగా వైసీపీ కూడా భారీ వ్యూహాన్నే రచించినట్లు సమాచారం. 2024 ఎన్నికలు ముగిసిన నాటి నుంచి గన్నవరంలో వైసీపీ పేరే వినిపించడం లేదు. అసలు పార్టీ కార్యాలయం తలుపులు తీస్తున్నారో, లేదో కూడా తెలియదు. వంశీతో పాటు ఆయన ముఖ్య అనుచరులంతా కేసుల్లో ఇరుక్కుని అరెస్టు కావడమో..లేదంటే పరారీలో ఉండటమో చేస్తున్నారు. ఈ కారణంగా అసలు వైసీపీ మాటే గన్నవరంలో వినిపించడం లేదు. ఇలాంటి క్రమంలో వంశీ అనుచర గణమంతా ఇప్పటికే టీడీపీ బాట పడుతున్నారు. ఈ వలసలను ఆపాలంటే%ొ% నియోజకవర్గంలో ఎవరినో ఒకరిని రంగంలోకి దించాలి. అది వంశీ కుటుంబం నుంచి

ఆయన సతీమణి పంకజశ్రీ అయితే మరీ మంచిదన్న వాదనతోనే ఈ వ్యూహం రచించినట్లుగా తెలుస్తోంది.

# చంద్రబాబు మార్క్ వ్యూహం

**హైదరాబాద్ పెన్ పవర్:**
చంద్రబాబు. ఆయన మార్క్ అభివృద్ధే వేరు. పొలిటికల్ వ్యూహలే సెపరేటు. 35 ఏళ్ల రాజకీయ అనుభవం, అంతకు మించి అడ్మినిస్ట్రేషన్ స్కిల్స్‌తో ఎప్పుడేం చేయాలి..ఎప్పుడు ఏ డెసిషన్ తీసుకుంటే బాగుంటుందో ఆయనకు తెలిసినంతగా ఎవరికీ తెలియదేమో. అంతలా స్ట్రాటజీ ప్లే చేసి వర్కౌట్ చేస్తూ వస్తుండటం బాబు స్పెషాలిటీ. అడ్మినిస్ట్రేషన్, కమ్యూనికేషన్స్ విషయంలో చంద్రబాబుకు తిరుగులేని బ్రాండ్ ఇమేజ్ ఉంది. ఇప్పుడు మరోసారి ఆల్ ఇండియా లెవెల్‌లో ఆయన చక్రం తిప్పుతున్నారు.కేంద్రంలో బీజేపీకి 240 సీట్లే రావడంతో..మిత్రపక్షాలపై ఆధారపడి సంకీర్ణ ప్రభుత్వం నడుస్తోంది. దాంతో టీడీపీకి ప్రాధాన్యం పెరిగింది. చంద్రబాబు చెప్పిందే వేదం అనే పరిస్థితి. ఆయనే కింగ్ మేకర్ అయినట్లు మారింది రాజకీయం. అయినా ఆయన ఏ మాత్రం లైన్ దాటడం లేదు. తన అవసరం ఉందన్న స్థాయి డిమాండ్లు కూడా చేయట్లేదు. బీజేపీతో, మోదీతో సఖ్యతతో ఉంటూ..ఏపీ అభివృద్ధికి స్ట్రాంగ్ పునాదులు వేస్తున్నారు.తన పార్టీకి పదవులు, తన రాజకీయ అవసరాల కంటే..నమ్మి అధికార మిచ్చిన ప్రజల ఆశలు నెరవేరాలంటే..కేంద్రం నుంచి నిధులు రావాల్సిందేనన్న పట్టుదలతో ఉన్నారు చంద్రబాబు. అందుకే నో ఇగోస్..ఓన్లీ డెవలప్‌మెంట్ పాలసీ అంటూ ముందుకెళు న్నారు. మహానాడు వేదికపై మోదీపై చంద్రబాబు ప్రశంసలు కురిపించడం కూడా ఆయన మార్క్ స్ట్రాటజీ అంటున్నారు. నిజానికి మహానాడు అనేది టీడీపీ పార్టీ పండుగ. అయినా ఆ వేదిక కూటమి ప్రస్తావన తెస్తూ..మోదీ పాలనను పొగిడి..కూటమి అవసరాన్ని..ఏపీ అభివృద్ధి కోసం మోదీతో కలిసి పనిచేస్తున్న తీరును చెప్పకనే చెప్పారు



బాబు మాత్రం అందుకు భిన్నంగా..బీజేపీకి దగ్గరగా..ఏపీ ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా వ్యవహరిస్తున్నారన్న ఒపీనియన్స్ ఉన్నాయ్. 2024 జూన్‌లో ఎన్నికల ఫలితాలు వచ్చాక చంద్రబాబు ఢిల్లీ వెళ్లే వరకు ఆయన స్టాండ్ ఏంటో క్లారిటీ లేక పొలిటికల్ సస్పెన్స్ కంటిన్యూ అయింది. మోదీనే తమ నాయకుడని చెప్పి..అన్ని ఊహాగానాలకు తెరదించి ఇప్పటికీ అదే స్టాండ్ మీద ఉన్నారు చంద్రబాబు. మహానాడులో కేంద్రమంత్రి పెమ్మసాని చెప్పినట్లు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు రాబట్టడంలో కూడా తన మార్క్ చూపిస్తున్నారు టీడీపీ

చంద్రబాబు.రాష్ట్రానికి వీలైనన్ని ఎక్కువ ఆర్థిక ప్రయోజనాలు సాధించడమే లక్ష్యంగా..చంద్రబాబు కేంద్రంతో లావాదేవీల తరహా సంబంధాన్ని నడుపుతున్నారనేది ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయం. గతంలో యునైటెడ్ ఫ్రంట్, వాజ్‌పేయి ఎన్డీఏ ప్రభుత్వాలకు మద్దతిచ్చిన అనుభవం, తనకున్న పరిపాలనా దక్షతతో..ఏపీకి నిధులు తెస్తున్నారు. బీజేపీ మద్దతు లేకున్నా ఏపీలో నెగ్గుకురాగల సామర్థ్యం చంద్రబాబుకు ఉన్నప్పటికీ, కేంద్రంతో సయోధ్యకే ఆయన ప్రాధాన్యమిస్తుండడానికి కారణం రాష్ట్ర అభివృద్ధి ఎజెండానే అంటున్నారు.అదే ఎన్డీయే కూటమిలో ఉన్న నితీశ్ కుమార్ వ్యక్తిగత రాజకీయ అవసరాల కోసమే కేంద్రాన్ని, బీజేపీని వాడుకుంటున్నారన్న చర్చ ఉంది. అధినేత.అడ్మినిస్ట్రేషన్ బాగా తెలిసిన బాబుకు..ఢిల్లీ స్థాయిలో ఏపీకి సంబంధించిన ప్రయోజనాలను ఎలా పొందాలో వ్యూహాత్మక ప్లాన్స్ అమలు చేస్తారనడంలో డౌటే లేదు. ఏపీ అభివృద్ధి కోసం బాబు ఏదైనా అడిగితే కేంద్ర మంత్రులు కాదనలేని పరిస్థితి. అది అమరావతి రింగ్‌రోడ్ అయినా..రాజధాని అభివృద్ధి కోసం నిధులైనా..కేంద్రాన్ని ఒప్పించి, మెప్పించి నిధులు తెస్తున్నారు. అలా తన అనుభవం, అడ్మినిస్ట్రేషన్ స్కిల్స్, ఫ్యూచర్ బేస్డ్ డెవలప్‌మెంట్ ప్లాన్స్‌తో నవ్యాంధ్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారు చంద్రబాబు. అందుకే బాబు రూటే సెపరేటు అంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు.

## తాను ఎందుకు అత్యుత్తమమో బుమ్రా మరోసారి నిరూపించుకున్నాడు.. డివిలియర్స్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

- ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఓడిన గుజరాత్
- ఉత్కంఠ పోరులో ముంబయి గెలుపు
- అద్భుతమైన యార్కర్‌తో సుందర్‌ను బోల్తా కొట్టించిన బుమ్రా
- ఈ వికెట్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పిన స్టార్ పేసర్
- ఈ విషయమై దక్షిణాఫ్రికా మాజీ ప్లేయర్ ఏబీ డివిలియర్స్ ఆసక్తికర వ్యాఖ్యలు



హైదరాబాద్ పెన్ పవర్: ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఐపీఎల్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ (జీటీ)పై ముంబయి ఇండియన్స్ (ఎంఐ) గెలిచిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఎంఐ 228 పరుగులు సింది. జీటీకి 229 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. కానీ, కొండంత లక్ష్యఛేదనలో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 208 రన్స్ మాత్రమే చేయగలిగింది. దీంతో ముంబయి 20 పరుగుల తేడాతో గెలిచింది. ఈ పరాజయంతో గుజరాత్ టైటాన్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక, ఈ గెలుపుతో రేపు (ఆదివారం) అహ్మదాబాద్ వేదికగా జరిగే క్వాలిఫయర్-2కి ముంబయి అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్)తో ఎంఐ తలపడనుంది. కాగా, నిన్నటి ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబయి స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అద్భుతమైన బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పిన సంగతి తెలిసిందే.

అద్భుతమైన యార్కర్‌తో ధాటిగా బ్యాటింగ్ చేస్తున్న వాషింగ్టన్ సుందర్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. జీటీ 13.3 ఓవర్లలో 2 వికెట్లకు 151 రన్స్‌తో పటిష్ట స్థితిలో ఉన్న సమయంలో సుందర్(48)ను బుమ్రా పెవిలియన్‌కి పంపి కోలుకోని దెబ్బతీశాడు. సాయి సుదర్శన్‌తో కలిసి అతడు నెలకొల్పిన 84 పరుగులు భాగస్వామ్యానికి తెరదించాడు. ఇదే మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఈ విషయమై దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ ఓ లైవ్ స్ట్రీమింగ్ కార్యక్రమంలో మాట్లాడాడు. "బుమ్రాకు సరైన సమయంలో ముంబయి కెప్టెన్ హార్దిక్ పాండ్య బౌలింగ్ ఇచ్చాడు. సుదర్శన్ అతని బౌలింగ్ అంతకుముందు బాగా ఆడాడు. అందుకే బుమ్రాకు కాస్త ఆలస్యంగా బంతిని ఇచ్చాడు. ఎప్పుడైతే బుమ్రా తన కోటాలో మిగిలిన రెండు ఓవర్లు బౌలింగ్ వేయడానికి వచ్చాడో అప్పుడే నా కుమారుడితో నేను ఒక విషయం చెప్పా. 'అతడి బౌలింగ్ పూర్తయ్యేంత వరకు, ఈ మ్యాచ్ ముగియనట్లే' అన్నాను. తాను ఎందుకు అత్యుత్తమమో బుమ్రా ఈ మ్యాచ్‌లో మరోసారి నిరూపించుకున్నాడు" అని డివిలియర్స్ అన్నాడు.

అలాగే సాయి సుదర్శన్ కూడా కీలకమైన సమయంలో ఔట్ కావడం మ్యాచ్‌లో టర్నింగ్ పాయింట్ అని పేర్కొన్నాడు. ఇక, ఈ మ్యాచ్ లో జీటీకి ఏదీ అనుకూలంగా జరగలేదని డివిలియర్స్ తెలిపాడు. వారు ఏకంగా మూడు క్యాచ్‌లు డ్రాప్ చేశారని, కీలకమైన ప్లేయర్ కుశాల్ మెండిస్ హిట్ వికెట్‌గా పెవిలియన్ చేరడం కూడా దెబ్బతీసిందని ఆర్‌సీబీ మాజీ ఆటగాడు చెప్పుకొచ్చాడు.

## భారత్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కారణం అదే: డివిలియర్స్

- రోహిత్, కోహ్లీ టెస్ట్ వీడ్కోలు తర్వాత గిల్ కెప్టెన్సీలో ఇంగ్లండ్ పర్యటన
- జూన్ 20 నుంచి ఐదు టెస్టుల సిరీస్, కొత్త ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్ ఆరంభం
- యువ కెప్టెన్ గిల్‌పై భారీ బాధ్యతలున్నాయన్న ఏబీ డివిలియర్స్
- భారత్‌లో ప్రతిభకు లోటు లేదు, ఐపీఎల్ కీలక పాత్ర పోషిస్తోందని వ్యాఖ్య



హైదరాబాద్ పెన్ పవర్: భారత టెస్ట్ క్రికెట్ దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలిగిన అనంతరం, యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో టీమిండియా కీలకమైన ఇంగ్లండ్ పర్యటనకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో, గిల్‌పై ఎంతో బరువు బాధ్యతలు ఉన్నాయని దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ పేర్కొన్నారు.టీమిండియా జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడనుంది. ఈ పర్యటన ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ కొత్త సీజన్‌కు శ్రీకారం చుట్టనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో, ఇంగ్లండ్ గడ్డపై యువ భారత జట్టు ప్రదర్శన ఎలా ఉంటుందనే దానిపై అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. గత ఏడాదే ఆస్ట్రేలియా పర్యటనలో సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా టెస్టుల నుంచి తప్పుకోగా, స్టార్ పేసర్ మహ్మద్ షమీ ఫిట్‌నెస్ సమస్యల కారణంగా ఈ ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక కాలేదు. ఇవన్నీ భారత జట్టుకు కొంత ప్రతికూలాంశాలుగా మారాయి.ఇలాంటి కీలక సమయంలో, 25 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌కు టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడం నిజంగా ఒక కఠిన పరీక్ష అని చెప్పాలి. ఈ విషయంపై ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఏబీ డివిలియర్స్ మాట్లాడుతూ, "టీమిండియాలో ఒక కొత్త శకం మొదలవడానికి ఇది సరైన తరుణం. యువ ఆటగాళ్లు తమ సత్తా ఏంటో నిరూపించుకోవాలి. కొత్త టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌పై జట్టును ముందుకు నడిపించాల్సిన పెద్ద బాధ్యత ఉంది" అని అన్నారు. భారతదేశంలో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదని, ఈ విషయంలో ఐపీఎల్ పాత్ర ఎంతో కీలకమని ఆయన ప్రశంసించారు. "ప్రతిభ ఉన్న ఎంతో మంది యువకులను ఐపీఎల్ వెలుగులోకి తెస్తోంది. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ వంటి యువ ఆటగాళ్లు తమ ఆటతీరులో గొప్ప పరిణతి కనబరిచారు" అని డివిలియర్స్ తెలిపారు.ఇంగ్లండ్‌లో టీమిండియా ఎదుర్కోబోయే సవాళ్ల గురించి కూడా డివిలియర్స్ ప్రస్తావించారు. "ఇంగ్లండ్‌తో వారి సొంతగడ్డపై టెస్ట్ సిరీస్ ఆడటం అంత తేలికైన విషయం కాదు. కానీ, భారత ఆటగాళ్లలో ప్రతిభకు లోటు లేదు. వారు సంకల్పించుకుంటే ఏదైనా సాధించగలరు" అని ఆయన వివరించారు.విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోవడంపై కూడా ఏబీ డివిలియర్స్ స్పందించారు. "కోహ్లీ తాను అనుకున్నది చేశాడు. చాలా సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఆడాడు. అదృష్టవశాత్తూ, మనం అతడిని ఇంకా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మైదానంలో చూడగలుగుతున్నాం. అయితే, టెస్ట్ క్రికెట్‌లో మాత్రం కోహ్లీని కచ్చితంగా మిస్ అవుతాం" అంటూ కోహ్లీని డివిలియర్స్ కొనియాడారు.

## టీ20 క్రికెట్‌లో బుమ్రా చీట్ కోడ్: ముంబై పేసర్‌పై అశ్విన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



హైదరాబాద్ పెన్ పవర్: ఐపీఎల్ 18లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచులో ముంబై ఇండియన్స్ ఉత్కంఠ విజయం సాధించింది. చివరి వరకు నువ్వా నేనా అన్నట్లుగా సాగిన ఈ మ్యాచులో 20 పరుగుల తేడాతో గుజరాత్‌ను చిత్తు చేసి ముంబై క్వాలిఫయర్ 2కు దూసుకెళ్లింది. ఈ మ్యాచులో ముంబై ఇండియన్స్ 228 పరుగులు చేయగా.. గుజరాత్ 208 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. అయితే.. భారీ ఛేదనలో జీటీ కూడా ధీటుగానే ఆడింది. జీటీ బ్యాటర్స్ సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్ అద్భుతంగా పోరాడారు. వీరిద్దరూ ధాటిగా ఆడటంతో ఒక దశలో గుజరాత్ గెలిచేలా కనిపించింది. కానీ ముంబై స్టార్ పేసర్ బుమ్రా గుజరాత్‌ను దెబ్బకొట్టాడు. గుజరాత్‌ను విజయం దిశగా తీసుకెళ్తోన్న సాయి సుదర్శన్, సుందర్ జోడీని కీలక సమయంలో విడదీశాడు. 14 ఓవర్లో ఏ బ్యాటర్‌కైనా ఆడటానికి కష్టమైన యార్కర్‌తో సుందర్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో 84 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. గిల్ సేనకు అప్పటి వరకు గెలుస్తామనే చిన్న ఆశ ఉండగా.. జీటీ గెలుపు ఆశలపై బుమ్రా నీళ్లు చల్లాడు. ఈ క్రమంలో బుమ్రా అద్భుత ప్రదర్శనపై ప్రశంసలు కురుస్తున్నాయి. టీమిండియా మాజీ స్టార్ స్పిన్నర్ అశ్విన్ కూడా బుమ్రాను కొనియాడాడు. టీ20 క్రికెట్‌లో జస్ప్రీత్ బుమ్రా ఒక చీట్ కోడ్ అని.. అతడు కెప్టెన్ స్థాయిని మరింత పెంచుతాడని అశ్విన్ ప్రశంసించాడు.

అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ 'అష్ కి బాత్'లో మాట్లాడుతూ.. "బుమ్రా 14 ఓవర్ వేయకపోతే ఆట ఇంకా క్లోజ్?గా వెళ్లేది. రిక్వైర్డ్ రన్ రేట్ ఓవర్?కు 12, 13, 14 ఉండగా.. బుమ్రా తన చివరి రెండు ఓవర్లలో 7 లేదా 8 పరుగులే ఇచ్చాడు. బుమ్రా బౌలింగ్?లో రాహుల్ తెవాటియా ఒక సిక్స్ కొట్టాడు. కానీ తర్వాతి రెండు బంతుల్లో ఒక పరుగు మాత్రమే ఇచ్చాడు. నేటి %u%20 క్రికెట్‌లో బుమ్రా చీట్ కోడ్ అని నేను %u%20 వరల్డ్ కప్ సందర్భంగా ట్వీట్ చేశా. మీరు ఎప్పుడైనా ఈ రోడ్ రాష్, %చీఖీూ% గేమ్ ఆడారా..? ఈ ఆటల్లో చీట్ కోడ్ ఎంటర్ చేస్తే మీరు వేగంగా పరిగెత్తుతారు. ఇతరుల్ని ఓడిస్తారు. అచ్చం ఇలాగే.. కెప్టెన్ కూడా వికెట్ కావాలన్నప్పుడు బుమ్రాను ఒక చీట్ కోడ్ లాగా ఉపయోగిస్తారు. అప్పుడు బుమ్రా యార్కర్స్, స్లో బాల్స్?తో వికెట్ తీసి కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టి.. అతని స్థాయిని మరింత పెంచుతాడని పేర్కొన్నారు.

## ఆ టైమ్ లో బాలీవుడ్ ను వదిలేద్దామనుకున్నా

సుధీర్ బాబు హీరోగా పదేళ్ల కిందట వచ్చిన భలే మంచి రోజు సినిమాలో హీరోయిన్ గా నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన వామికా గబ్బి ఆ తర్వాత ఇక్కడ కనిపించలేదు. వామికా ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు 20 ఏళ్లవుతుంది. కెరీర్ స్టార్టింగ్ లో జూనియర్ ఆర్టిస్టుగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా సినిమాలు చేసిన వామికా ప్రస్తుతం బాలీవుడ్ లో



స్టార్ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తూ కెరీర్ లో ముందుకెళ్తుంది. రీసెంట్ గా కీర్తి సురేష్ నటించిన బేబీ జాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన వామికా గబ్బి ఆ సినిమాతో మంచి గుర్తింపే దక్కించుకుంది. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే వామికాకు ప్రస్తుతం ఆఫర్లు బాగానే వస్తున్నాయి. త్వరలోనే వామికా నుంచి వరుస సినిమాలు రానున్నాయి. భలే మంచి రోజు తర్వాత ప్రస్తుతం తెలుగులో అడివి శేష్ తో కలిసి జీ2 సినిమాలో నటిస్తోంది వామికా. ెలుగు, తమిళ, పంజాబీ, హిందీ భాషల్లో సినిమాలు చేస్తున్న వామికా సినిమాలతో పాటూ వెబ్ సిరీస్‌ల్లో కూడా నటిస్తోంది. రీసెంట్ గా వామికా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని సంచలన వ్యాఖ్యలు చేసి వార్తల్లోకెక్కింది. ప్రస్తుతం పలు భాషల్లో బిజీగా ఉన్న వామికా 2019లో బాలీవుడ్ ను వదిలి వెళ్లిపోవాలని అనుకున్నట్టు కామెంట్ చేసి అందరినీ ఆశర్చపరిచింది.అయితే బాలీవుడ్ ను విడిచి వెళ్లాలనుకోవడానికి రీజన్ ను మాత్రం వామికా బయటపెట్టలేదు. దాంతో పాటూ తాను కేవలం లండన్ వెళ్లేందుకు మాత్రమే 83 అనే సినిమాలో చిన్న క్యారెక్టర్ లో నటించానని, ఆ ఎక్స్‌పీరియెన్స్ తనలో యాక్టింగ్ పట్ల ఇష్టాన్ని పెంచిందని వామికా వెల్లడించింది. కబీర్ ఖాన్ దర్శకత్వంలో తెరకెక్కిన 83 సినిమాలో వామికా అన్ను లాల్ పాత్రలో కనిపించింది.



డెనిమ్ లుక్‌లో శార్వరి అద్భుతంగా ఉంది



చిత్రాంగద సింగ్ తన స్టైల్‌తో ఇన్‌స్టాగ్రామ్ లో వెలుగులు నింపింది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com